
ANN తెలుగు
Follow: @ANNTELUGU
24-11-2025
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 336 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఆగింది ఐబొమ్మే.. పైరసీ కాదు

### శుక్రవారం రిలీజైన సినిమాలన్నీ మూవీ రూల్జ్‌లో ప్రత్యక్షం

ప్రేమంటే, రాజు వెడ్స్ రాంబాయి సహా ఇతర సినిమాలు కూడా

మరోవైపు ఐబొమ్మ రవికి నెటిజన్ల మద్దతు

**హైదరాబాద్, మహా:** పైరసీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించినా ఫలితం ఎప్పటిలాగే ఉంది. ఐబొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు ఇమంది రవిని అరెస్టు చేసి ఐబొమ్మతో పాటు బప్పం టీవీ సైట్ లను క్లోజ్ చేసినా సినిమా పైరసీ ఆగడంలేదు. ఆగింది ఐబొమ్మే తప్ప పైరసీ కాదని తాజాగా తేలింది. శుక్రవారం విడుదలైన సినిమాలన్నీ ఒకే రోజులో పైరసీ సైట్లలో ప్రత్యక్షం కావడమే దీనికి నిదర్శనం.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

## టైమ్ ప్లీజ్


- స్పీకర్‌కు దానం నాగేందర్ లేఖ
- రాజీనామా లేకుండా కొత్త వ్యూహం



02

## అవసరమైతే రాజకీయ పార్టీ పెడతా..


- మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి



02

## భారత్ ఒక హిందూ దేశం

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్
- దండయాత్రల రోజులు పోయాయి



02



53వ ప్రధాన న్యాయమూర్తిగా

## జస్టిస్ సూర్యకాంత్ నేడు ప్రమాణం

- తొలిసారి విదేశీ అతిథులు
- నేపాల్, భూటాన్, శ్రీలంక, మారిషస్, కెన్యా, మలేసియా నుంచి జడ్జీలు
- రాష్ట్రపతి భవన్‌లో కార్యక్రమం

వివరాలు 2లో



తెలంగాణ రైజింగ్

## గ్లోబల్ సమ్మిట్ కు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు
- డిసెంబర్ 8, 9 తేదీలలో జరుగనున్న సమ్మిట్
- దాదాపు రెండు వేల మంది హాజరయ్యే అవకాశం

వివరాలు 2లో

తెలంగాణ మంత్రుల వాట్సాప్ మీడియా గ్రూపులపై

## సైబర్ దాడి

- ఎస్బీఐ కేవైసీ అప్‌డేట్ పేరుతో మోసపూరిత సందేశాలు
- హానికరమైన ఏపీకే ఫైల్స్ ద్వారా వ్యక్తిగత వివరాల చోరీ
- గుర్తుతెలియని లింక్స్ క్లిక్ చేయొద్దని పోలీసుల హెచ్చరిక

వివరాలు 2లో

# కవిత.. దూకుడు

### జాగృతి జనంబాట సక్సెస్

**బీఆర్ఎస్‌కు సవాళ్లు.. గ్రౌండ్‌లో కనెక్ట్ అవుతున్న ప్రజలు**

ఉన్నది ఉన్నట్లుగా.. కవిత చురకలు

తెలంగాణపై సంపూర్ణ అవగాహన ఉన్న కవిత



జాగృతి జనంబాట చేపట్టిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ప్రజల నుండి మంచి స్పందన కనిపిస్తోంది. కవిత కార్యక్రమంపై మొదట్లో చాలా మంది నేతలు పెదవి విరిచారు. గతంలో వైఎస్ షర్మిల యాత్రతో పోల్చుకున్నారు. కానీ సీన్ లో అలాంటి భ్రమలను, అంచనాలను కవిత పటాపంచలు చేస్తున్నారు. తనపై లిక్కర్ కేసు నమోదుకాగానే డాటర్ ఆఫ్ ఫైటర్.. తగ్గేదెలే అని కవిత ప్రకటించుకున్నారు. మొదటి నుండీ కవిత నైజం పోరాటమే. పోరాడకుండా ఆమెకు ఏదీ దక్కలేదు. ఇపుడు కవితను బయటకు పంపిన తర్వాత.. స్వీయ అస్తిత్వం కోసం ఆమె ప్రారంభించిన జనం బాట రోజులు గడిచిన కొద్దీ స్పందన పెరుగుతున్నది. కవితకు లభిస్తున్న స్పందన, లేవనెత్తుతున్న సమస్యలు, సంధిస్తున్న ప్రశ్నలు తెలంగాణ రాజకీయాల్లో కవిత ఎంత కీ రోల్ పోషిస్తున్నదో అర్థమవుతున్నది. అసలు తెలంగాణ రాజకీయాలు గత నాలుగేళ్ళుగా కవిత చుట్టే తిరుగుతున్నాయి. కవిత ప్రస్తావన లేకుండా ఏ ఎన్నికల ప్రచారమూ ముగియడం లేదు. కవిత లేవనెత్తే ప్రశ్నలకు బీఆర్ఎస్ నేతల దగ్గర సమాధానం లేదు. కాంగ్రెస్., బిజెపి నేతలకంటే కవిత సంధించే ప్రశ్నలు గతంలో తప్పులు చేసిన బీఆర్ఎస్ నేతలకు నేరుగా తగులుతున్నాయి. రంగారెడ్డి జిల్లాలో.. కవిత పర్యటన సూపర్ హిట్ అయింది. -మహా, హైదరాబాద్

మిగతా 2లో

## కవిత ఫ్యాక్టర్

కవిత ఫ్యాక్టర్ బీఆర్ఎస్ పై గట్టిగా పనిచేస్తోంది. విదేశాల్లో సోషల్ మీడియా పెట్టి తనను ఇబ్బందిపెడుతున్నారని, తనపై అవాకులు చవాకులు పేలుతున్నారంటూ గళమెత్తిన కవిత.. ఆ తర్వాత నుండి ఎటాక్ స్టార్ట్ చేసింది. కవిత దూకుడు పెంచి, ఎటాక్ చేసిన తర్వాతే సోషల్ మీడియాలో ఆమెపై విమర్శలు తగ్గాయి. కొందరు నేతలు ప్రత్యేక క్యాంపులు, శిబిరాలు పెట్టి తనను తీవ్రంగా ఇబ్బందిపెట్టారని, దుష్ప్రచారం చేశారని కవిత ఆరోపించడంతో విమర్శలకు కౌంటర్లు ఇచ్చే టీమ్ ను తయారుచేసుకోవడంతో సోషల్ ట్రోలింగ్స్ తగ్గిపోయాయి. కవిత ఇచ్చే కౌంటర్లకు, సంధించే ప్రశ్రలకు సమాధానం చెప్పలేక సోషల్ టీం సతమతమవుతోంది. కవిత దూకుడు తో అనేక అంశాల్లో బీఆర్ఎస్ కు స్పందించాల్సిన పరిస్థితి కనబడుతుండగా, పలు అంశాలు కాంగ్రెస్, బిజెపి నేతలకంటే కవిత బలంగా ఎత్తిచూపగలుతున్నారన్న చర్చ జరుగుతోంది.



# కలిసి నడుద్దాం బ్రదర్


### తెలుగు రాష్ట్రాల్లో లీడర్స్ ఛీర్స్.. జోడీ పాతదే.. కలయిక కొత్తగా

**ఇటు చంద్రబాబు-రేవంత్, అటు జగన్ - కేటీఆర్ భేటీల వ్యూహం**

ఉద్దేశపూర్వకమా? యాదృచ్ఛికమా?

**హైదరాబాద్, మహా :** చంద్రబాబురేవంత్, జగన్—కేటీఆర్ జోడీ పాతదే. కానీ భేటీ కొత్తగా కనబడుతోంది. వరుస భేటీలు, వరుసగా వేదికలు పంచుకోవడం తెలుగురాజకీయాల్లో జరగబోతున్న మార్పులకు సంకేతంగా కనబడుతోంది. ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ హైదరాబాద్‌లో కోర్టుకు హాజరైన సందర్భంగా భారీ ప్రదర్శన నిర్వహించారు. అభిమానులు పోటెత్తారు. తరువాత శనివారం బెంగళూరులో జగన్ – కేటీఆర్ కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొని ఒకే వేదిక పంచుకోవడం ఆసక్తిగా మారింది. రెండు రాష్ట్రాల రాజకీయ పటంలో కొత్త గా ఏదో జరగబోతుందన్న సంకతం కనబడుతోంది. మరోవైపు ఒకే వారంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో తెలంగాణ ముఖ్యమంత్రి రెండుసార్లు వేదికలు పంచుకున్నారు. కలిసి మాట్లాడారు. ఎవరి రాజకీయాలు వారివే. గత కొన్నేళ్ళుగా బహిరంగంగా కలవడానికి ఇబ్బందులు పడ్డ నేతలు, ఇపుడు జట్టుగా బహిరంగంగా కనబడుతున్నారు. రామోజీ ఫిల్మ్ సిటీలో చంద్రబాబు, రేవంత్ , వెంకయ్యలాంటి దిగ్గజాల కలయిక, ముఖ్యమంత్రులయ్యాక ఇద్దరూ కలిసి నవ్వుతూ మాట్లాడుకోవడం ఇద్దరు అభిమానుల కళ్ళనిండా ఆనందంనింపింది. మరోవైపు జగన్ కేటీఆర్ లు బెంగుళూరు లో ఓ కార్యక్రమంలో కలిసి నవ్వులు పంచుకోవడం కూడా అదే స్థాయిలో వైరల్ గా మారింది. జూబ్లీహిల్స్ బైపోల్ తర్వాత గ్రేటర్ లో పట్టుకు నేతలు స్ట్రాటజీలు మార్చినట్లు కొందరు భావిస్తుండగా, ఏపీలో గెలవాలన్నా.. పట్టు నిలవాలన్నా ముందు తెలంగాణలో గెలవాలని, అందుకే సరికొత్త సమీకరణాలు జరుగుతున్నాయన్న చర్చలూ సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఏపీ నేతలంటేనే ఫైరయి కలవడానికి ఇబ్బందిపడ్డ నేతలు, ఇపుడు కలవడానికి తాపత్రయపడడం ఆసక్తిని కలిగిస్తోంది. ఏమైనా కలిసినడుద్దాం బ్రదర్ అంటూ నేతలు సాగడం ఏ సరికొత్త ఆవిష్కరణలు చేస్తుందో చూడాలి.






## ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

### సర్పంచ్ ఎన్నికల ఖర్చుపై స్పష్టత.. గరిష్ట పరిమితి రూ. 2.50 లక్షలు

జనాభా ప్రాతిపదికన సర్పంచ్ అభ్యర్థుల వ్యయ పరిమితులు ఖరారు

**ఖమ్మం బ్యూరో, మహా:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, సర్పంచ్ అభ్యర్థులు ఎన్నికల ప్రచారం కోసం చేసే ఖర్చుపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. 2011 జనాభా లెక్కలను ప్రామాణికంగా తీసుకుని, ఆయా గ్రామాల్లోని ఓటర్ల సంఖ్య ఆధారంగా అభ్యర్థుల వ్యయ పరిమితులను ఖరారు చేశారు. ఎన్నికల్లో ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేసి, పారదర్శకతను మరియు సమతౌల్యాన్ని

మిగతా 2లో




## రేవంత్ మార్క్

### జై జవాన్.. జై కొడంగల్

తెలంగాణ ముఖచిత్రంపై తొలి సైనిక్ పాఠశాల

వికారాబాద్ జిల్లాలో పీపీపీ పద్ధతిలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు..నేడు శంకుస్థాపన

**హైదరాబాద్ , మహా:** తెలంగాణ విద్యా వ్యవస్థలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. దేశ రక్షణే ఊపిరిగా భావించే యువతను తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలో మొట్టమొదటి సైనిక్ స్కూల్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో, వెనుకబడిన ప్రాంతంగా

మిగతా 2లో



## అవసరమైతే రాజకీయ పార్టీ పెడతా..

**మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి**

**శ్రీకాకుళం, మహా:** తన రాజకీయ జీవితంపై మాజీ ఎంపీ, మాజీ వైసీపీ నేత విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతానికి తనకు ఏ రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన లేదని.. అవసరమైతే పార్టీ పెట్టడానికి తాను వెనకాడబోనని తేల్చి చెప్పారు. తనపై చాలా ఒత్తిళ్లు వచ్చాయని.. వాటికి ఏమాత్రం తలొగ్గలేదని స్పష్టం చేశారు. తన విషయంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ చుట్టూ ఉన్న కోటరీ ఆయన్ని డైవర్ట్ చేస్తోందని అభిప్రాయపడ్డారు. నిబద్ధత లేని వారి మాటలు వినవద్దని ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు విజయసాయిరెడ్డి హితవు పలికారు.

## భారత్ ఒక హిందూ దేశం

**ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్**

### దండయాత్రల రోజులు పోయాయి

**మహా:** భారత్ ఒక హిందూ సమాజమని, ఇది ఒక హిందూ దేశమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఆదివారం లక్నోలో జరిగిన 'దివ్య గీతా ప్రేరణ ఉత్సవ్' కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్ భగవత్ మాట్లాడుతూ.. భగవద్గీత బోధనలు ప్రతీ యుగానికి, ప్రతీ పరిస్థితికి మార్గనిర్దేశం చేస్తాయని అన్నారు. "ప్రస్తుతం సమాజంలో భౌతిక సంపద పెరుగుతున్నప్పటికీ, శాంతి, నైతికత, సంతృప్తి కొరవడుతున్నాయి. దీనికి పరిష్కారం మన సనాతన జీవన విలువలలోనే ఉంది," అని ఆయన అభిప్రాయపడ్డారు. సమస్యల నుంచి పారిపోకుండా, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని శ్రీకృష్ణుడు గీతలో బోధించారని గుర్తు చేశారు.



## బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మరో మోసం

**మాజీ మంత్రి తలసాని**

**హైదరాబాద్, మహా :** బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ మరో మోసానికి తెరలేపిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. తెలంగాణలో కులగణన ఎక్కడా సరిగ్గా జరగలేదన్నారు. కుల గణన సరిగ్గా జరగలేదని మరోసారి చేశారని.. అది కూడా పూర్తి స్థాయిలో జరగలేదని తెలిపారు. డెడికేషన్ కమిషన్ వివరాలు సైతం పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదని చెప్పారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఏర్పాటు చేసిన ధర్నాకు కాంగ్రెస్ పార్టీ పెద్దలు హాజరుకాలేదని విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో దాసోజ్ శ్రవణ్‌తో కలిసి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీ బిల్లు అమలు కాకుండానే రేవంత్ సర్కార్ జీవో తెచ్చిందంటూ మండిపడ్డారు. బీసీల జీవోను కోర్టులో కొట్టేశారని తెలిపారు. శనివారం జీవో 46ను విడుదల చేశారని.. కానీ ఇది స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు చెల్లదని కుండబద్దలు కొట్టారు.

## ఆగింది ఐబొమ్మే.. పైరసీ కాదు

(మొదటిపేజీ తరువాయి)

ఐబొమ్మ కన్నా ముందునుంచే సినిమాలను పైరసీ చేస్తున్న మూవీరూల్జ్ సైట్ లో తాజా సినిమాలన్నీ ప్రత్యక్షమయ్యాయి. థియేటర్లలో వీడియో కెమెరాతో రికార్డు చేసి ఈ సైట్‌లో అప్ లోడ్ చేసినట్లు తెలుస్తోంది. తాజా సినిమాలు అల్లరి హీరోగా వచ్చిన 12ఏ రైల్వే కాలనీతో పాటు సంతాన ప్రాప్తిరస్తు, రాజు వెడ్స్ రాంబాయి, ప్రేమంటే సినిమాలు మూవీరూల్జ్ సైట్ లో కనిపిస్తున్నాయి. విడుదలైన ఒక్కరోజులోనే సినిమాలు పైరసీ సైట్ లో ప్రత్యక్షం కావడంతో నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఐబొమ్మ రవికి పెరుగుతున్న మద్దతు

ఐబొమ్మ రవిని కాల్చివేయాలని, టెర్రరిస్టు అని రకరకాలుగా సినీ ప్రముఖులు విమర్శలు చేస్తున్నా సామాన్యుల నుండి ఐబొమ్మ రవికి మద్దతు పెరుగుతోంది. పలు ఆటోల వెనుక ఐబొమ్మ రవికి సపోర్ట్ గా ఆయన ఫొటోతో పోస్టర్లు పెట్టుకుంటున్న పరిస్థితి పలుచోట్ల కనిపించింది. నెటిజన్ల వేలాదిగా ఐబొమ్మ రవిని సమర్థిస్తూ ఆయనపై చర్యలు తీసుకోవొద్దని పోస్టులు పెడుతున్నారు.

# కవిత.. దూకుడు



**హైదరాబాద్ -మహా:**

జాగృతి జనంబాట చేపట్టిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ప్రజల నుండి మంచి స్పందన కనిపిస్తోంది. కవిత కార్యక్రమంపై మొదట్లో చాలా మంది నేతలు పెదవి విరిచారు. గతంలో వైఎస్ షర్మిల యాత్రతో పోల్చుకున్నారు. కానీ సీన్ లో అలాంటి భ్రమలను, అంచనాలను కవిత పటాపంచలు చేస్తున్నారు. తనపై లిక్కర్ కేసు నమోదు కాగానే డాటర్ ఆఫ్ ఫైటర్.. తగ్గేదెలే అని కవిత ప్రకటించుకున్నారు. మొదటి నుండీ కవిత నైజం పోరాటమే. పోరాడకుండా ఆమెకు ఏదీ దక్కలేదు. ఇపుడు కవితను బయటకు పంపిన తర్వాత.. స్వీయ అస్తిత్వం కోసం ఆమె ప్రారంభించిన జనం బాట రోజులు గడిచిన కొద్దీ స్పందన పెరుగుతున్నది. కవితకు లభిస్తున్న స్పందన, లేవనెత్తుతున్న సమస్యలు, సంధిస్తున్న ప్రశ్నలు తెలంగాణ రాజకీయాల్లో కవిత ఎంత కీ రోల్ పోషిస్తున్నదో అర్థమవుతున్నది. అసలు తెలంగాణ రాజకీయాలు గత నాలుగేళ్ళుగా కవిత చుట్టే తిరుగుతున్నాయి. కవిత ప్రస్తావన లేకుండా ఏ ఎన్నికల ప్రచారమూ ముగియడం లేదు. కవిత లేవనెత్తే ప్రశ్నలకు బీఆర్ఎస్ నేతల దగ్గర సమాధానం లేదు. కాంగ్రెస్., బిజెపి నేతలకంటే కవిత సంధించే ప్రశ్నలు గతంలో తప్పులు చేసిన బీఆర్ఎస్ నేతలకు నేరుగా తగులుతున్నాయి. రంగారెడ్డి జిల్లాలో.. కవిత పర్యటన సూపర్ హిట్ అయింది. మెదక్ లో దుమ్మురేపింది. ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న విధానం, ప్రజలతో కలిసిపోతున్న విధానం.. ప్రశ్నలోని నిజాయితీ ఆమెకు ఆదరణ పెంచుతోంది . ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు చేపట్టిన ఈ పర్యటనలలో భాగంగా, ప్రజలు తమ కష్టాలను తెలియజేస్తున్నారు. ముఖ్యంగా రైతు సమస్యలు, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయని, ఈ కార్యక్రమానికి ప్రజలు తరలివస్తున్నారని నివేదించింది.

### సంచలనాలే కాదు.. సూచనలు

**కవితతో ప్రజలు స్వయంగా మాట్లాడటం, సమస్యలను తెలియజేయడం వంటివి జరుగుతున్నాయి. దీంతో కార్యక్రమాలకు ప్రజలు తరలివస్తున్నారు. ప్రజలు కవితను కలిసేందుకు, సమస్యలు చెప్పేందుకు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. రైతులు, యువత, మహిళలు ఈ వర్గాల కష్టాలను ఆమె తెలుసుకుంటూ కొన్నింటిపై అక్కడికక్కడే అధికారులతో మాట్లాడుతున్నారు. కవిత బృందం కూడా పర్యటనలో భాగంగా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తోంది. కవిత ప్రస్తావించిన పలు సమస్యలను అధికారయంత్రాంగం అక్కడికక్కడే పరిష్కరిస్తోంది. మెదక్ లో రింగురోడ్డు రింగులపై కవిత చేసిన వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. హరీష్ రావు, నవీన్ రావు, గంగుల కమలాకర్ భూములపై ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ కాక పుట్టించాయి. దీనిపై ఎమ్మెల్సీ నవీన్ కుమార్ స్పందించారు. అనేకమంది నేతలు కవితపై ఎటాక్ చేసినా చలించలేదు. దమ్ముంటే హరీష్ రావును కౌంటర్ ఇవ్వమని సవాల్ చేశారు. తొణకని బెణకని కవిత సాహసం చూసి నేతలు ముగ్దులవుతున్నారు. సోషల్ మీడియాలో కాదు గ్రౌండ్ ను పట్టించుకుంటే జూబ్లిహిల్స్ లో రిజల్ట్ ఉంటుండే అంటూ కవిత వేసిన కౌంటర్ ను బీఆర్ఎస్ శ్రేణులు కూడా నిజమేనని వైరల్ చేశాయి. దాంతో సోషల్ గ్రౌండ్ ను వదిలి పత్తిమార్కెట్ ను కేటీఆర్, హరీష్ రావులు జిల్లాల్లో సందర్శించారు. యాక్షన్.. రియాక్షన్ అంటూ కవిత టీమ్ స్పందించింది. ఇక మహేశ్వరం నియోజకవర్గంలో కవిత పర్యటనలో కబ్జాల అంశాన్ని ప్రస్తావించి నేరుగా ఎటాక్ చేయడంతో పెద్ద సంచలనమైంది. సబితా ఇంద్రారెడ్డిని టార్గెట్ చేసుకుని డాక్యుమెంట్లతో దండయాత్ర చేసిన తీరు కవితకు అనేకమంది అభిమానులను సంపాదించి పెట్టింది. ఇపుడు పాలమూరు జిల్లాలో కవిత పర్యటిస్తోంది. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, వివిధ ప్రాధాన్యరంగాలను ఫోకస్ చేసుకుని కవిత జిల్లాలు చుట్టేస్తోంది.**

# 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నేడు ప్రమాణం

### తొలిసారి విదేశీ అతిథులు

- నేపాల్, భూటాన్, శ్రీలంక, మారిషస్, కెన్యా, మలేసియా నుంచి జడ్జీలు
- రాష్ట్రపతి భవన్‌లో కార్యక్రమం



**న్యూఢిల్లీ, మహా :** భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆరు దేశాల నుంచి విదేశీ ప్రతినిధుల బృందం హాజరుకానుంది. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో నేపాల్, భూటాన్, శ్రీలంక, మారిషస్, కెన్యా దేశాల ప్రధాన న్యాయమూర్తులు పాల్గొననున్నారు. అలాగే మలేసియా నుంచి ఓ బృందం రానుంది. విదేశాలకు చెందిన ఐదుగురు సీజేలు, ఆరుగురు న్యాయమూర్తులతో పాటు వారి కుటుంబ సభ్యులు కలిపి మొత్తం 15 మంది అతిథులు హాజరుకానున్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విదేశీ బృందం రానుండటం ఇదే తొలిసారి. అలాగే వీరంతా భారత రాజ్యాంగ దినోత్సవం (నవంబరు 26న) కార్యక్రమంలోనూ పాల్గొంటారు.

### ఇదీ నేపథ్యం..

జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో మధ్య తరగతి కుటుంబంలో ... పోషించారు. కాగా, దేశవ్యాప్తంగా వివిధ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న 5కోట్లకు పైగా కేసుల పరిష్కారానికి కృషి చేయడం, వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గంగా 'గేమ్ చేంజర్' మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించడానికి సీజేఐగా అత్యంత ప్రాధాన్యం ఇస్తానని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. సోమవారం సీజేఐగా ప్రమాణం చేయనున్న నేపథ్యంలో శనివారం ఆయన తన నివాసంలో మీడియాతో ముచ్చటించారు. న్యాయమూర్తులు, తీర్పులపై ఆన్‌లైన్ ట్రోలింగ్ వంటి విషయాలు తనను ఎప్పుడూ కలవరపెట్టలేదన్నారు. సహేతుకమైన విమర్శలు ఎప్పుడూ ఆమోదయోగ్యమని అన్నారు.

# రేవంత్ మార్క్

## జై జవాన్.. జై కొడంగల్

### తెలంగాణ ముఖచిత్రంపై తొలి సైనిక్ పాఠశాల

### వికారాబాద్ జిల్లాలో పీపీపీ పద్ధతిలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు.. నేడు శంఖుస్థాపన

(మొదటిపేజీ తరువాయి)



పేరున్న కొడంగల్ నియోజకవర్గం ఇప్పుడు విద్యా కేంద్రంగా మారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూపుదిద్దుకోనున్న ఈ ప్రాజెక్టు, గ్రామీణ విద్యార్థులకు భారత రక్షణ దళాల్లో చేరేందుకు రాజమార్గం వేయనుంది.

### జై జవాన్.. జై కొడంగల్!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొట్టమొదటిసారిగా ఒక పూర్తిస్థాయి సైనిక్ స్కూల్ మంజూరు దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లా, కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం, హకీంపేట గ్రామం ఈ ప్రతిష్టాత్మక విద్యాసంస్థకు వేదిక కానుంది. ఇక్కడ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'ఎడ్యుకేషన్ హబ్'లో ఈ సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి కేంద్ర రక్షణ శాఖ ఆధ్వర్యంలోని సైనిక్ స్కూల్ సొసైటీ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఈ నెల 21న ఢిల్లీ నుంచి వచ్చిన నిపుణుల కమిటీ, ప్రతిపాదిత స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సానుకూలత వ్యక్తం చేయడం విశేషం. త్వరలోనే దీనిపై కేంద్రం నుంచి అధికారిక ముద్ర పడనుంది. ఈ బృహత్తర కార్యానికి నవంబర్ 24న అంకురార్పణ జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ పాఠశాల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే హకీంపేటలో సుమారు 11 ఎకరాల సువిశాలమైన స్థలాన్ని కేటాయించింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో ఈ పాఠశాల నడవనుంది. నిబంధనల మేరకు భవన నిర్మాణాలు, మౌలిక వసతులు, నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. అన్ని వసతులు సిద్ధమైతేనే కేంద్రం తుది అనుమతులు మంజూరు చేస్తుంది. మరోవైపు, రాష్ట్రంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలలను సైనిక్ స్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేయాలంటూ విద్యాశాఖ రెండు నెలల క్రితమే ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. ఇందులో రంగారెడ్డి, హనుమకొండ, యాదాద్రి జిల్లాల జడ్పీ పాఠశాలలతో పాటు మరో నాలుగు రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. అయితే, వికారాబాద్ జిల్లాలో ఇప్పుడు పూర్తిగా కొత్తగా (గ్రీన్‌ఫీల్డ్) సైనిక్ స్కూల్ మంజూరు అవుతుండటంతో, అదే జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలను మార్చే ప్రతిపాదనను విరమించుకునే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లోని ప్రతిపాదనలపై స్పష్టత రావాల్సి ఉంది.

### నూతన విధానంలో విప్లవాత్మక మార్పులు

**గతంలో కేవలం రెసిడెన్షియల్ విధానంలోనే నడిచే సైనిక్ స్కూళ్లలో, ఇప్పుడు డే స్కాలర్ పద్ధతికి కూడా అనుమతి లభించడం విశేషం. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే అఖిల భారత ప్రవేశ పరీక్ష లో ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సాగే ఈ విద్యాభ్యాసంలో ప్రైవేటు భాగస్వామ్యం ఉన్నప్పటికీ, ఫీజులో సగం భారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. దేశవ్యాప్తంగా ఇప్పటికే 102 పాఠశాలలు ఈ పీపీపీ మోడల్‌లో విజయవంతంగా నడుస్తున్నాయి. ఇప్పుడు ఆ జాబితాలో కొడంగల్ కూడా చేరనుండటం తెలంగాణ విద్యార్థులకు శుభవార్తే.**

# ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

## సర్పంచ్ ఎన్నికల ఖర్చుపై స్పష్టత.. గరిష్ఠ పరిమితి రూ. 2.50 లక్షలు

### జనాభా ప్రాతిపదికన సర్పంచ్ అభ్యర్థుల వ్యయ పరిమితులు ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

పాటించే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

**సర్పంచ్ అభ్యర్థుల ఖర్చుపై ఆంక్షలు**


రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంటున్న తరుణంలో, ఎన్నికల సంఘం అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి స్పష్టమైన నిబంధనలను ప్రకటించింది. ఎన్నికలు ప్రశాంతంగా, న్యాయబద్ధంగా జరిగేలా చూడటమే లక్ష్యంగా ఈసారి వ్యయ పరిమితులను కఠినతరం చేసింది. ప్రధానంగా 2011 జనాభా లెక్కల ఆధారంగా గ్రామాలను వర్గీకరించి, అక్కడి ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా సర్పంచ్ అభ్యర్థులు ఎంత మొత్తం ఖర్చు చేయవచ్చనేది నిర్ణయించారు. ఈ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీలను ఓటర్ల సంఖ్య ప్రాతిపదికన రెండు ప్రధాన వర్గాలుగా విభజించారు. 5,000 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పెద్ద గ్రామ పంచాయతీలలో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారం కోసం గరిష్ఠంగా రెండున్నర లక్షల రూపాయల (రూ. 2.50 లక్షలు) వరకు ఖర్చు చేసేందుకు అనుమతినిచ్చారు. పెద్ద గ్రామాల్లో ఓటర్లను చేరుకోవడానికి, ప్రచారానికి ఎక్కువ వనరులు అవసరమవుతాయనే ఉద్దేశంతో ఈ వెసులుబాటు కల్పించారు. అదేవిధంగా, 5,000 లోపు ఓటర్లు ఉన్న చిన్న గ్రామ పంచాయతీలలో సర్పంచ్




అభ్యర్థులకు ఖర్చు పరిమితిని లక్షన్నర రూపాయలకు (రూ. 1.50 లక్షలు) పరిమితం చేశారు. జనాభా తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అనవసరపు ఖర్చులను నివారించడానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. అభ్యర్థులు ఈ నిర్ణీత పరిమితులకు లోబడి మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుందని, ఈ నిబంధనలు పాటించడం ద్వారా ఎన్నికల ప్రక్రియలో సమానత్వం సాధ్యమవుతుందని ఎన్నికల సంఘం అభిప్రాయపడింది

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

### అధికారులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు.. డిసెంబర్ 8, 9 తేదీలలో జరుగనున్న సమ్మిట్.. దాదాపు రెండు వేల మంది హాజరయ్యే అవకాశం







**హైదరాబాద్, మహా :** డిసెంబర్ 8, 9 తేదీలలో ఫ్యూచర్ సిటీలో జరుగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సమ్మిట్‌కు సంబంధించి పలు విషయాలపై అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించనున్న సమ్మిట్ కు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల ప్రతినిధులు, అంబాసిడర్లు ఈ సమ్మిట్‌లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాస్‌లు లేకుండా ఎవరు ఎంట్రీ కావడానికి వీలు లేదని, సమ్మిట్‌కు సంబంధం లేని వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వకూడదని స్పష్టం చేశారు. శాఖల వారీగా పకడ్బందీగా అధికారులకు ఎంట్రీ ఉంటుందని వెల్లడించారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు తాను పరిశీలిస్తానని అన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బంది రాకూడదని చెప్పారు. బందోబస్తుకు వచ్చే పోలీస్ సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమ్మిట్‌కు హాజరయ్యే మీడియాకు కూడా తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సదస్సుకు దేశ విదేశాల నుండి సుమారు రెండు వేల మంది ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచడం, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడం ఈ సమ్మిట్ ముఖ్య ఉద్దేశం. అంతర్జాతీయ స్థాయిలో తన విజన్, పాలసీలను ప్రదర్శించడానికి ఈ సమ్మిట్ ఒక ముఖ్య వేదికగా కానుందని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సమ్మిట్‌ను పూర్తి స్థాయిలో సక్సెస్ చేయడంతో పాటు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది.

ANN తెలుగు

మహా పత్రిక

03

సోమవారం, హైదరాబాద్ | 24-11-2025 | జనరల్ న్యూస్ | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

# తెలంగాణ మంత్రుల వాట్సాప్ మీడియా గ్రూపులపై సైబర్ దాడి

- ఎస్బీఐ కేవైసీ అప్‌డేట్ పేరుతో మోసపూరిత సందేశాలు
- హానికరమైన ఏపీకే ఫైల్స్ ద్వారా వ్యక్తిగత వివరాల చోరీ
- గుర్తుతెలియని లింక్స్ క్లిక్ చేయొద్దని పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. ఈసారి ఏకంగా రాష్ట్ర మంత్రులనే లక్ష్యంగా చేసుకుని వారి వాట్సాప్ మీడియా గ్రూపులను హ్యాక్ చేశారు. ఎస్బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) కేవైసీ అప్‌డేట్ పేరుతో సాగుతున్న ఈ మోసం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనపై సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు.

### మోసం ఎలా జరుగుతోంది?

హ్యాకర్లు అత్యంత పకడ్బందీగా ఈ దాడికి పాల్పడ్డారు. ముందుగా మంత్రులు, వారి మీడియా సిబ్బంది ఉన్న వాట్సాప్ గ్రూపుల్లోకి వివిధ మార్గాల్లో చొరబడ్డారు. ఆ తర్వాత గ్రూప్ పేరు, డీపీ (డిస్‌ప్లే పిక్చర్)లను ఎస్బీఐ బ్యాంకు అధికారిక లోగో పేరుతో మార్చేశారు. దీంతో గ్రూపులోని సభ్యులు దాన్ని నిజమైన సందేశంగా భ్రమపడేలా చేశారు. అనంతరం, "మీ ఎస్బీఐ ఖాతాకు ఆధార్ నంబర్ అప్‌డేట్ కాలేదు. ఈకేవైసీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయకపోతే ఈ రాత్రికి మీ ఖాతా శాశ్వతంగా బ్లాక్ అవుతుంది" అంటూ గ్రూపులో నకిలీ సందేశాలు పంపించారు. ఈ సమస్యను సులభంగా పరిష్కరించుకోవడానికి అంటూ ఓ ఏపీకే ఫైల్ లింక్‌ను కూడా షేర్ చేశారు. ఈ ఏపీకే ఫైల్ అత్యంత ప్రమాదకరమైన మాల్‌వేర్ అని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పొరపాటున ఎవరైనా ఈ లింక్‌ను క్లిక్ చేసి, ఆ ఫైల్‌ను తమ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేస్తే వారి వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు, లాగిన్ పాస్‌వర్డ్‌లు మొత్తం హ్యాకర్ల చేతికి చిక్కుతాయి. తద్వారా బ్యాంకు ఖాతాలను పూర్తిగా ఖాళీ చేసే ప్రమాదం పొంచి ఉంది.

### పోలీసుల హెచ్చరికలు

ఈ ఘటనపై తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు వెంటనే స్పందించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కీలక సూచనలు జారీ చేశారు. ఎస్బీఐ లేదా మరే ఇతర బ్యాంకు పేరుతో వచ్చే ఏపీకే ఫైల్స్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ చేయవద్దని స్పష్టం చేశారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే లింక్‌లను క్లిక్ చేయరాదని సూచించారు. ఒకవేళ పొరపాటున ఎవరైనా ఇలాంటి ఫైల్స్‌ను ఓపెన్ చేసి ఉంటే, ఆందోళనతో తమ బ్యాంకు ఖాతా బ్యాలెన్స్ చెక్ చేయకుండా, వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 లేదా 15531కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఇటీవల కాలంలో 'డిజిటల్ అరెస్ట్', ఆధార్/పాన్ అప్‌డేట్ వంటి పేర్లతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేశారు. మంత్రులు, వారి సిబ్బంది తమ వాట్సాప్ గ్రూపులు, ఖాతాలను పునరుద్ధరించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

# మనుషుల్లో దేవుడు భగవాన్ సత్యసాయిబాబా

## ప్రేమతో మనుషులను గెలిచిన మహనీయుడు

### మానవ సేవే మాధవ సేవ అని చెప్పడం కాదు చేసి చూపించిన మహనీయుడు

### సాయిబాబా శత జయంతి ఉత్సవాలలో సీఎం రేవంత్ రెడ్డి





**పుట్టపర్తి, మహా :** భగవాన్ సత్య సాయిబాబా ఆలోచనలు, ఆశయాలను ప్రజల్లో విస్తృతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సాయిబాబా శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో జరిగిన సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయిబాబా సేవలను గుర్తుచేసుకున్నారు. మానవ రూపంలోని దేవుడు సాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడం గొప్ప గౌరవంగా ప్రకటించారు. "సాయిబాబా మనుషుల్లో దేవుడిని చూశారు. ప్రేమతో మనుషులను గెలిచారు. సేవలతో దేవుడిగా కొలువబడుతున్నారు. మానవులను ప్రేమించాలి. ప్రేమ గొప్పది. ప్రేమ ద్వారా ఏదైనా సాధించవచ్చని నిరూపించారు. సత్య సాయిబాబా మన మధ్యన లేకపోయినా వారిచ్చిన స్ఫూర్తి, భావన నిర్వాహకులందరిలో కనిపిస్తోంది. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలు కూడా చేయలేని సేవలను బాబా, వారి ట్రస్టు ద్వారా చేసి చూపించారు. ముఖ్యంగా ప్రతి వారూ చదువుకోవాలని ప్రభుత్వాలతో పోటీ పడి కేజీ టు పీజీ వరకు పేదలకు ఉచితంగా విద్యను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. విద్య, వైద్యం, తాగునీటి సౌకర్యం కల్పించడంలో ఎంతో కృషి చేశారు. జీవితంలో చివరి దశలో మరణం తప్ప వేరే మార్గం లేదని అనుకున్న దశలో ఎంతో మందిని బతికించి దేవుడిగా కొలువబడుతున్నారు. పాలమూరు లాంటి వలస జిల్లాలు కరువు కాటకాలతో కునారిల్లుతున్న కాలంలో, ప్రభుత్వాలు సైతం తాగునీటి సౌకర్యాలు కల్పించలేని కాలంలో నా సొంత జిల్లా పాలమూరు దాహార్తిని తీర్చారు. అనంతపురం జిల్లాలో తాగునీటి సౌకర్యం కల్పించారు. తమిళనాడు రాష్ట్రంలో సైతం బాబా సేవలను విస్తృత పరిచి ఈనాడు అందరి మనసుల్లో దేవుడిగా శాశ్వత స్థానం సాధించారు. మానవ సేవే మాధవ సేవ అని బోధించడమే కాకుండా సంపూర్ణంగా నమ్మి విశ్వసించారు. ఈనాడు 140 దేశాల్లో బాబాకి భక్తులు ఉండటమే కాకుండా వారంతా వివిధ మార్గాల్లో సేవలు అందిస్తున్నారు. సాయి శతజయంతి ఉత్సవాల్లో రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్లు, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల మంత్రులు, దాదాపు 40 నుంచి 50 దేశాలకు చెందిన ప్రముఖులు ఎంతో మంది హాజరయ్యారంటే వారి ప్రత్యేకతను గుర్తు చేసుకోవలసిన అవసరం ఉంది. సత్య సాయిబాబా ఆలోచనలను, వారు అనుసరించిన విధానాలను ప్రజలకు చేరవేయడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది.." అని ముఖ్యమంత్రి చెప్పారు. హిల్ వ్యూ స్టేడియంలో కార్యక్రమం తర్వాత ముఖ్యమంత్రి సాయి కుల్వంత్ హాలులోని సత్య సాయిబాబా మహాసమాధిని దర్శించుకున్నారు.

# టైమ్ ప్లీజ్

- స్పీకర్‌కు దానం నాగేందర్ లేఖ
- రాజీనామా లేకుండా కొత్త వ్యూహం

**హైదరాబాద్, మహా :** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జారీ చేసిన నోటీసులపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎట్టకేలకు స్పందించారు. ఈ మేరకు స్పీకర్ కు లేఖ రాశారు. వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. స్పీకర్ ఇచ్చిన గడువు ముగియంతో తాజాగా లేఖ ద్వారా దానం స్పందించారు. మరోవైపు ఫిరాయింపుల చట్టం కింద చర్యలకు అవకాశం ఇవ్వకుండా.. ముందుగానే ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారని పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బీఫాంపై దానం పోటీ చేసినందున పార్టీ మారినట్లు ఆధారాలున్నాయని, రాజీనామా చేస్తేనే వేటు తప్పుతుందని నేతలు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే దానం నాగేందర్ శనివారం శ్రీధర్ బాబును కలిసి చర్చించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పంచాయతీ ఎన్నికలు వస్తున్నందున వాటి తర్వాతే దానం రాజీనామా ఉంటుందనే ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యే పదవికి రాజీనామా తప్పనిసరైతే తదుపరి చర్యలు, ప్రత్యామ్నాయం ఏమిటనే అంశాలపైనా దానం దృష్టి సారించినట్లు సమాచారం.



# ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హామీతో ఉపసంహరించుకున్న బిజెపి రిలే నిరాహార దీక్ష

**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్ల గూడెం రైల్వే గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని బిజెపి చేపట్టిన రిలే నిరాహార దీక్షను ఆదివారం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీతో దీక్ష ఉపసంహరించుకున్నట్లు బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు పూజారి కుమారస్వామి తెలిపారు. గుండ్ల గూడెం అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో గుండ్ల గూడెం గేటు వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికిమూడు రోజులు అయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్ల గూడెం రైల్వే గేట్ కారణంగా గుండ్ల గూడెం, శివ లాల్ తండా, పటేల్ గూడెం శ్రీనివాసపురం గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వనందున కాలయాపన జరుగుతుంది. దీంతో విద్య వైద్యం ఉద్యోగం అవసరాల కోసం ఆలేరు రావడానికి గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో గుండ్లగూడెం అండర్పాస్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ మూడు రోజులపాటు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీనికి స్పందించిన స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆరు నెలల్లో బ్రిడ్జి పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చి దీక్ష ఉపసంహరించుకోవాలని కోరుతూ బిజెపి నాయకులకు నిమ్మరసం తాగించి దీక్షను విరమింప చేశారు. దీంతో ఆయా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నందగంగేష్ జిల్లా కౌన్సిల్ నెంబర్స్ బోగ శ్రీనివాస్ వడ్డేమాన్ నరేందర్ ప్రధాన కార్యదర్శిలు శేషత్వం అమరేందర్ సుంకరి సృజన్ ఎలగల వెంకటేష్ కార్యదర్శులు బైరి మహేందర్ గౌడ్ కట్ట అమరేందర్ రెడ్డి వడ్డేపల్లి కిషన్ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు అర్చన బూత్ అధ్యక్షులు మైదం రాంప్రసాద్ ,గాదే వాసు గడ్డం, సందీప్, ఈసరపు శ్రీనివాస్, కొరుటూరి మధు ,పసుపు నూరి వీరేశం, పంపరి లక్ష్మీనారాయణ, నరసింహారెడ్డి, కళ్లెం రాజు ,గిరిబోయిన పరుశరాములు, కాంద్రాజు శ్రీనివాస్, శ్రీ రోజు శ్రీకాంత్, వెంటిక ,నవీన్ ,వినోద్, కొత్తపెల్లి శివ, కళ్లెపు మధు తో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే మా లక్ష్యం

## ఎస్ హెచ్ జీలకు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు

### సిద్దిపేట జిల్లా కోహెడలో మంత్రి పొన్నం కీలక ప్రకటన




**సిద్దిపేట, మహా :** మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, మహిళలకు స్వయంగా బొట్టు పెట్టి చీరలు అందించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, వ్యాపార అవకాశాలు కల్పిస్తూ, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, వారిని తమ అక్కాచెల్లెళ్లతో సమానంగా చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఆదివారం సిద్ధిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద జరిగిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు స్వయంగా బొట్టు పెట్టి చీర (సారే) అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం అనేక విప్లవాత్మక కార్యక్రమాలను చేపట్టిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మహిళా సంఘాలకు (ఎస్ హెచ్ జీ) గత పది సంవత్సరాల నుంచి వడ్డీ లేని రుణాలను నిరంతరంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు, బస్సులు వంటి వ్యాపార అవకాశాలను కల్పిస్తోందన్నారు. ఇక ముందు కూడా అర్హులైన వారికి వాటిని అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి మహిళా సంఘాల సభ్యులు స్వయంగా బొట్టు పెట్టి ఈ ఇందిరా మహిళా శక్తి చీరల సారె పంపిణీని చేపడుతున్నారని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకు ఈ చీరలు పంపిణీ చేయబడతాయని మంత్రి పేర్కొన్నారు. 'మీకు ఏ కష్టం రానివ్వం. భవిష్యత్తులో ఆర్థిక వృద్ధి సాధించి మహిళలు ఉన్నత శిఖరాలకు ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుంది' అని ఆయన మహిళలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, వాటిని ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయితీలో తాగునీటి శుద్ధి కోసం వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

గౌరవెల్లి ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని, ఒక్కో మెట్టు పూర్తి చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. కాలువల నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతుల త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అనంతరం కోహెడ మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయానికి రూ. 10 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వానికి ఆశీర్వాదం ఇవ్వాలని, మరిన్ని మంచి కార్యక్రమాలతో ముందుకు పోతామని మంత్రి ప్రజలను కోరారు.

# ఇంటి జాగాకు రాజముద్ర!

- తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం
- డబుల్ రిజిస్ట్రేషన్లకు ఫుల్‌స్టాప్
- డిజిటల్ రికార్డులతో పారదర్శకత



**ఖమ్మం బ్యూరో, మహా:** తెలంగాణలో ఆస్తి కొనుగోలు అంటేనే భయం, ఆందోళన అనే రోజులకు ఇక కాలం చెల్లిపోనుంది. రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖలో దశాబ్దాలుగా పేరుకుపోయిన అవినీతి, అక్రమాలకు చరమగీతం పాడుతూ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇన్నాళ్లు కేవలం సాగు భూములకే పరిమితమైన 'పట్టా' విధానాన్ని, ఇకపై ఇండ్లు మరియు ఖాళీ స్థలాలకు కూడా వర్తింపజేయాలని నిర్ణయించడం ఒక చారిత్రక మలుపు.

### సామాన్యుడికి భరోసా.. యాజమాన్య హక్కు పత్రం

భూముల రిజిస్ట్రేషన్ వ్యవస్థలో అత్యంత కీలకమైన మార్పు 'టైటిల్ డీడ్' (యాజమాన్య హక్కు పత్రం) జారీ చేయడం. ఇప్పటివరకూ ఇండ్లు లేదా ప్లాట్ల విషయంలో కేవలం రిజిస్ట్రేషన్ దస్తావేజులు మాత్రమే ఆధారంగా ఉండేవి. కానీ ప్రభుత్వ తాజా నిర్ణయంతో, వ్యవసాయ భూములకు పాస్‌బుక్ ఇచ్చినట్లే, ఇండ్లు మరియు స్థలాలకు కూడా ప్రభుత్వం పక్కాగా యాజమాన్య హక్కు పత్రాన్ని జారీ చేస్తుంది. దీనివల్ల ఆస్తిపై యజమానికి పూర్తి భద్రత లభించడమే కాకుండా, భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చినట్లవుతుంది.

### అవినీతికి చెక్

రిజిస్ట్రేషన్ల శాఖలో మానవ ప్రమేయాన్ని తగ్గించి, టెక్నాలజీని వజ్రాయుధంగా మార్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన 'బ్లాక్ చైన్' సాంకేతికతను ప్రవేశపెడుతున్నారు. ఈ విధానం ప్రత్యేకత ఏమిటంటే, ఒకసారి ఆస్తి వివరాలు సాఫ్ట్‌వేర్‌లో నమోదైతే, ఇక ఆ డేటాను మార్చడం గానీ, ట్యాంపరింగ్ చేయడం గానీ సాక్షాత్తు ఆ శాఖ అధికారులకు కూడా సాధ్యం కాదు. దీనివల్ల పాత తేదీలతో దొంగ రిజిస్ట్రేషన్లు చేయడం, రికార్డులు మాయం చేయడం వంటి అక్రమాలకు శాశ్వతంగా తెరపడుతుంది.

### డబుల్ రిజిస్ట్రేషన్లు ఇక అసాధ్యం

ఒకరికి అమ్మిన ఆస్తిని మరొకరికి అమ్మడం, ఒకే స్థలానికి రెండు రిజిస్ట్రేషన్లు చేయడం వంటి మోసాలు అమాయక ప్రజలను కోర్టుల చుట్టూ తిప్పుతున్నాయి. కొత్త సాఫ్ట్‌వేర్ విధానంలో ప్రతి సర్వే నంబర్‌ను డిజిటల్‌గా లాక్ చేస్తారు. ఒక సర్వే నంబర్‌లో ఉన్న మొత్తం విస్తీర్ణం, జరిగిన రిజిస్ట్రేషన్లు, మిగిలిన స్థలం వివరాలు ఆన్‌లైన్‌లో స్పష్టంగా ఉంటాయి. ఉన్న భూమి కంటే ఒక్క గజం ఎక్కువ అమ్మాలని చూసినా, లేదా ప్రభుత్వ నిషేధిత జాబితాలోని భూములను రిజిస్టర్ చేయాలని ప్రయత్నించినా సిస్టమ్ ఆ లావాదేవీని అక్కడికక్కడే తిరస్కరిస్తుంది. సబ్ రిజిస్ట్రార్ల ప్రమేయం లేకుండానే సాఫ్ట్‌వేర్ స్వయంగా అక్రమాలను అడ్డుకోవడం ఈ వ్యవస్థలోని గొప్ప విషయం.

### లేఅవుట్ మోసాలకు ఫుల్‌స్టాప్

రియల్ ఎస్టేట్ వెంచర్లలో పార్కులు, రోడ్ల కోసం వదిలిన స్థలాలను కూడా ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్న ఉదంతాలు కోకొల్లలు. ఇకపై ఇలాంటి మోసాలు సాగవు. లేఅవుట్ ప్లాన్ అప్రూవల్ సమయంలోనే రోడ్లు, కామన్ ఏరియాలను సాఫ్ట్‌వేర్‌లో ఫ్రీజ్ చేస్తారు. ఆ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయడం అసాధ్యం. అలాగే, వెంచర్ విస్తీర్ణం, ప్లాట్ల కొలతలు సరిపోలితేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగుతుంది.

### డిజిటల్ రికార్డులతో పారదర్శకత

ఆస్తి చరిత్రను తెలుసుకోవడం ఇకపై సులభం కానుంది. 1983 నుంచి ఉన్న ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) వివరాలను డిజిటలైజ్ చేసి కొత్త విధానానికి అనుసంధానిస్తున్నారు. దీనివల్ల గత 40 ఏళ్లుగా ఆ ఆస్తి ఎవరెవరి చేతులు మారింది, లింక్ డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయం కొనుగోలుదారుడికి క్షణాల్లో తెలిసిపోతుంది. మొత్తంగా చూస్తే, ఈ సంస్కరణలు అమలైతే సివిల్ తగాదాలు సగానికి పైగా తగ్గుముఖం పడతాయని, సామాన్యుడి ఆస్తికి ప్రభుత్వమే రక్షకభటుడిగా నిలుస్తుందని చెప్పవచ్చు.

# దాతృత్వం చాటుకున్న మహేషన్న

## సొంతూరికి భారీ విరాళం.. 11 ఎకరాల భూమిని గ్రామాభివృద్ధికి ఇచ్చిన టీపీసీసీ చీఫ్



**నిజామాబాద్, మహా :** టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సొంతూరి పట్ల తనకున్న మమకారాన్ని, బాధ్యతను చాటుకున్నారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోని తన స్వగ్రామమైన రహత్ నగర్ లో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు 11 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. ఈ 11 ఎకరాల్లో 10 ఎకరాలను ఇంటిగ్రేటెడ్ స్కూలుకు, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు సబ్ స్టేషన్ కోసం ఒక ఎకరం భూమిని దానం చేశారు. ఈ స్కూల్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అధికస్థాయి విద్య, ఆధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. మహేశ్ కుమార్ గౌడ్ దాతృత్వాన్ని మెచ్చిన గ్రామస్తులు ఆయన్ను భారీ గజమాలలతో సత్కరించారు. గ్రామంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ. 50 లక్షలతో నిర్మిస్తున్న దుర్గాదేవి నూతన ఆలయ భూమి పూజలో పాల్గొన్న టీపీసీసీ చీఫ్. గతంలో తన తండ్రి బొమ్మ గంగాధర్ గౌడ్ గారు గ్రామంలో దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించిన విషయాన్ని స్మరించుకున్నారు. అనంతరం ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు ఈరావత్రి అనిల్, అన్వేష్ రెడ్డి,బాల్కొండ ఇంచార్జ్ సునీల్ రెడ్డి, మాజీ డిసిసీ నాయకులు తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్ బాల్యం తీపి గుర్తులను ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. తల్లిదండ్రులు చేసిన సేవల వల్లే నేను ఈ స్థాయికి వచ్చానని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిని అవుతానని ఊహించలేదని. ఎంత ఎత్తుకు ఎదిగినా గ్రామంతో నా అనుబంధం చివరి శ్వాస వరకు కొనసాగుతుందన్నారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. గ్రామం మీదుగా వెళ్లే టెంపుల్ కారిడార్ రోడ్డు కోసం సీఎం, సంబంధిత మంత్రితో మాట్లాడి రూ. 380 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించడం జరిగిందని చెప్పారు. ఈ రహత్‌నగర్ టెంపుల్ కారిడార్ రోడ్‌తో కరీంనగర్-నిజామాబాద్ మధ్య సెంటర్ పాయింట్ అవుతుందన్నారు. గ్రామానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య సౌకర్యాలు లభిస్తాయని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ధర్మపురి నుంచి బాసర వరకు ప్రతిపాదించిన టెంపుల్ కారిడార్ రోడ్డు రహత్ నగర్ గ్రామం మీదుగా రానుందని, ఇందుకు తానెంతో కృషి చేశానని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం తాను చేసిన సూచనలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకున్నందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రికోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

## జీవన పరిమళమే మట్టి పువ్వు

కాలం ఎంతో వేగంగా తరలిపోతున్నది. మనుషుల మధ్య సహచర్యం లోపిస్తున్నది. సంభాషణలకు అవకాశం లేదు. ఎవరి దుఃఖం వారు మోసుకుంటూ పోతున్నారు. ఓదార్చే తీరిక ఎవరికీ లేదు. ముఖ్యంగా కుటుంబానికి కూడా. ఎవరిని నిందించ పనిలేదు. పరిస్థితులు కూడా అంత వేగంగా మార్పులను తీసుకొస్తున్నాయి. తిన్నామా పడుకున్నామా అనే తరం మన కళ్ళ ముందు ఊరేగుతున్నది అరవైలో పుట్టిన తరం అనుభవాలు ఇప్పటి తరానికి ఎవరు చెప్పాలి? తమున్న స్థితికి పాదులు తీసి, పూలు వికసింప చేసిన తల్లిదండ్రుల జీవన వికాసం ఏమిటి? ఎవరు చెప్పాలి చెబితే మాత్రం ఎవరు వింటారు? అంతా సందడి సందడిగా, హడావుడిగా ఉంది. ఈ లోకం భవిష్యత్తులో నీవు ఎవరు నీ కుటుంబ నేపథ్యమేమిటని మన పిల్లలను ఎవరైనా ప్రశ్నిస్తే నోరెళ్లబెడతారు తప్ప రెండు నిమిషాలు కూడా విడమరిచి చెప్పలేరు. ఇది కళ్ళ ముందు కనిపించే వాస్తవం . ఈ పరిస్థితుల్లో జీరో స్థాయి నుండి ఎదిగి ఇటు కుటుంబానికి, సమాజానికి తమతమ స్థాయి మేరకు వెలుగును ఒకింత చైతన్యాన్ని నింపిన వ్యక్తుల జీవన పరిమళం గాలిలో కలిసి పోవాల్సిందేనా?!




అట్లా జరగరాదని ఒక గొప్ప ఆలోచనలతో సుప్రసిద్ధ రచయిత ఎన్. తిర్మల్ తాను అనుభవించిన మట్టి వాసన జీవన పరిమళాలను తర్వాత తరాలకు అందజేసే ప్రయత్నమే 'మట్టి పువ్వు' వచన రచన. ఇది ఒక రకంగా నిజాయితీగా రాసుకున్న ఆత్మకథ వంటిదే. ఇది తన కుటుంబం కోసమే కాదు అరవై దశాబ్దంలో జీవన పోరాటం చేసిన సగటు వ్యక్తుల అనుభవాలు అక్షరబద్ధం చేశారా అనిపిస్తుంది. సగటు మనిషికి అప్పుడప్పుడే విద్యాగంధం అంటుకుంటున్న రోజులు. బడికి వెళ్లే అలవాటు ఇంకా రాని కాలం. బడి అంటూ ప్రత్యేక వ్యవస్థగా రూపుదిద్దుకోలేని కాలం. ఏ అరుగుల మీదనో ఏకోపాధ్యాయ వీధిపడి. మధ్యాహ్నం అమెరికా సౌజన్యంతో సర్కారు పాఠశాలల్లో వండిన ఉప్మా తిని, వేడి వేడి పాలు తాగిన జ్ఞాపకాలు ఈ రచనలో ఒక తరాన్ని కదిలించివేస్తాయి. తిర్మల్ మొత్తం ముప్పైఒక్కఅనుభవాలను వివిధ పార్శ్వాలుగా వింగడించుకుని, తన జీవితానికి అనుసంధానించుకుంటూ రాసిన తీరు ఆకర్షణీయంగా ఉంది. పాత్రికేయునుగా, ఉపాధ్యాయునిగా, రచయితల సంఘాలలో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా తనకు తానుగా నిత్య చైతన్యాన్ని నింపుకున్న తీరు పాఠకుని మనసులో ఎన్నో సంఘటనలు నిలిచిపోతాయి. ఆధునిక సౌకర్యాలు లేని కాలంలో గ్రామాల్లో భజనలు, నాటకాలు, గ్రామీణ కళారూపాల సౌందర్యం

బాల్యంలో అనుభవించిన వ్యక్తులు తదనంతర కాలంలో కవులు గాను, కళాకారులుగాను, రచయితలుగాను, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులుగానూ ఎలా ఉబికి పైకి వస్తారో ఈ మట్టి పువ్వు చదివితే అర్థమవుతుంది. ఏ అనుభవము వృథా పోదని ఈ రచన చదివితే అవగతమవుతుంది. ఇలాంటి రచనకు పూనుకోవాలంటే కొంచెం ధైర్యం,ఇంకొంచెం నిజాయితీ, మరికొంచెం హద్దులు దాటనితనం కావాలి. స్వీయ నియంత్రణ రచయితకు అవసరం. ఇవన్నీ ఈ మట్టి పువ్వులో పరిమళిస్తాయి.ఎందుకంటే చిన్నప్పటి నుంచి ఎరిగిన బంధువులు, స్నేహితులు సహచర ఉద్యోగులు, రచయితలు ఇంకా తనతో జీవించే ఉన్నారు. అతిశయోక్తులకు పోవడానికి వీలు లేదు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకునే తన జీవన సారాన్ని ఈ వ్యాసాలలో అద్భుతంగా, వాస్తవ అనుభవాల ఆధారంగా అక్షరీకరించారు. రచన ఎంతో నిర్మలంగా ఉంది.దీనికి ముందుమాట రాసిన ఆచార్య జయధీర్ తిరుమలరావు అన్నట్లు "తన జీవితంలో వివిధ దశల్లో అనేక రూపాలు, మార్పులు, ఆలోచనలు నిక్షిప్తం చేసి మనకు అందిస్తున్న రచన ఇది". ఈ రచనను ఎవరు చదివితే వారికి తప్పకుండా స్ఫూర్తినిస్తుందని భావించవచ్చు.క్రమానుగత ఎదుగుదల విస్తరణకు ఎన్. తిర్మల్ జీవితం ఒక ఉదాహరణగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

**-కోట్ల వేంకటేశ్వర రెడ్డి**
**94402 33261**

**ప్రతులకు:- సహచర బుక్ హౌస్, హైదరాబాద్**
**తెలంగాణ పబ్లికేషన్స్, హైదరాబాద్. వెల 100/-**
**సెల్ 9441864514**

### పుస్తక సమీక్షలు

## బాల్యానుభావాల మూటలే గోటిలాట

బాల్యం చాలా అపురూపమైనది. కానీ నేటి పిల్లలకు బాల్యమే లేకుండా పోయింది. చిన్నప్పటినుండే పుస్తకాల భారం, చదువుల ఒత్తిడితో సతమతమవుతుంది బాలల లోకం. వెనుకటి లెక్క అమ్మమ్మలు, తాతయ్యలు కథలు చెప్పే పరిస్థితి లేదు. ఒకవేళ చెప్పినా వినే పరిస్థితిలో పిల్లలు లేరు. ఇటువంటి నేపథ్యంలో బాల సాహితీ ప్రపంచంలోకి అడుగుపెట్టిందే" గోటిలాట " కథల పుస్తకం. ప్రముఖ బాలసాహితీవేత్త గరి పెల్లి అశోక్ రాసిన ఈ పుస్తకం చదువుతుంటే రైలు బడి పుస్తకం యాదికొస్తది. ప్రాథమిక విద్యా బోధనలో బోధన తీరు, పిల్లల అనుభవాలు, విద్యార్థుల ఉపాధ్యాయుల సంబంధాల సారమే ఈ పుస్తకం. ఈ సంకలనంలో ఉన్న కథలన్నీ చిన్నప్పటి జ్ఞాపకాలే. అనుభవ పాఠాలే. నిజానికి చెప్పాలంటే ఇవి కథలు కావు. అచ్చట్లు ముచ్చట్లు కల్పిత సన్నివేశాలు అసలే కావు. బాలల లోకంలో ని యదార్థ దృశ్యాలు. ఆత్మీయతకు, అనురాగానికి,బంధాలకు, అనుబంధాలకు, ఆలోచనలకు చిహ్నాలు. నిజాయితీ నిండిన గుండెల్లో చిట్టి బుర్రల నుండివచ్చిన గట్టి కథలు.




పాఠ్య పుస్తకాలు ఒక్కటే చదవడం కాదు, జీవితానుభవములో జరిగే ప్రతి దృశ్యం, ప్రతి సంఘటన ఒక కథా వస్తువే అవుతుంది. ఇటువంటి కోణంలో నుండి పుట్టుకొచ్చిందే ఈ గోటీలాట సంకలనం.52 పేజీలు ఉన్న ఇందులో 11 కథలున్నాయి. ఇవన్నీ బడి పిల్లల కథలే. చిన్న చిన్న కథలు. బుజ్జి బుజ్జి కథలు. ఏ కథ చదివినా మనల్ని బాల్యంలోకి తీసుకుపోతాయి. సోపతిగాళ్ళతో , తోబుట్టువులతో తిరుగాడిన రోజులు గుర్తుకు వస్తాయి. లలిత, చరితల మధ్య వచ్చిన తగాదాలను ఉపాధ్యాయుడు ఎంతో నైపుణ్యంగా తీర్చిన విధానం ఆశ్చర్యం కలిగిస్తుంది. పిల్లలకు విధించిన శిక్ష కూడా ఎంతో సృజనాత్మకంగా ఉంటుంది. పిప్పరమెంట్ల కథ దగ్గర నుండి బఠానీలు, బిస్కెట్లు, కూరాచారు, ఎల్లిగడ్డలు, జామకాయలు, చిప్పల పండ్లు కథ వరకు ఏ కథ చదివినా యదార్థ దృశ్యాలు కనువిందు చేస్తాయి. ప్రతి కథలో గరిపెల్లి వాడిన పదాలు అలతి అలతిగా ఉండి విద్యార్థులను ఆకర్షించే విధంగా ఉంటాయి. ఈ పుస్తకం ముఖచిత్రం చూడగానే పిల్లల లోకం గుర్తుకొస్తుంది. ఇటువంటి మంచి పుస్తకాన్ని సుభోధిని గ్రంథాలయం వారు ప్రచురించడం అభినందనీయం. ఈ పుస్తకం ప్రతి పాఠశాల గ్రంథాలయంలో ఉండదగింది. రచయిత ఉపాధ్యాయుడు కాబట్టి, పిల్లల మనసెరిగి ఈ కథలకుండ కుమ్మరించాడు. వాటిని తాకితే చాలు బాలల హృదయాలు ఉప్పొంగ వలసిందే. రచయితకు ధన్యవాదాలు.

**- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,**
**94415 61655**

## రచనలకు ఆహ్వానం
**సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..**
**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
**mahaapatrika@gmail.com**
**whatsapp 9247580946**

## పుస్తక సమీక్షల కోసం...
**తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.**
**43/A, MLA Colony, Road No. 12,**
**Banjara Hills, Hyderabad. Telangana- 500034.**

**2016లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రభావర్మ**

# సత్యం నా కవిత నుండే పుడుతుంది



"మరణించే ముందు ఒక కవి చేయాల్సిందల్లా ఒక మంచి కవిత రాయడం మాత్రమే. మిగతాదంతా జీవితం ఆటోమాటిగ్గా చేసేస్తుంది" అంటారు ప్రభావర్మ. తన శ్యామమాధవం .అన్న పద్య నవలకు 2016 కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన ప్రభావర్మ మలయాళం లో ప్రముఖ కవి, రచయిత, పాత్రికేయడు, సినీ గీత రచయిత. వర్మ కవిత్వం సంప్రదాయము, ఆధునికతల కలబోత. మృదువైన ప్రేమ, సున్నితమైన భావోద్వేగం, తాత్విక అంతర్ దృష్టి. పదునైన పద చిత్రాలు ప్రభావర్మ కవిత్వాన్ని సుసంపన్నం చేసే అంశాలు

ప్రభా వర్మ 1959లో తిరువల్లలోని కడపరాలో టికె నారాయణన్ నంబూతిరి, ఎన్. పంకజాక్షి తంపురాట్టి దంపతులకు చిన్న కొడుకుగా జన్మించారు. న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. విద్యార్థి దశలో 197980 విద్యా సంవత్సరంలో కేరళ యూనివర్సిటీ యూనియన్ కార్యవర్గానికి ఎన్నికయ్యాడు.

వర్మ మొదటి కవితా సంపుటి 1990లో ప్రచురించబడిన సౌర్పర్ణిక . ఇది అతనికి వైలోప్పిల్లి అవార్డు, అంకణం అవార్డును కూడా గెలుచుకుంది. అతని రెండవ సంకలనం అర్క్కపూర్ణిమ పద్యానికి కేరళ సాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకుంది. దీని తర్వాత చందననాజి, ఆర్ద్రం, కళాప్రయాగ, అవిచరితం, మంజినోటు వేయిల్ ఎన్న పోలెయుమ్, అపరిగ్రహం, పొన్నిన్ కొలుస్ అనే కవిత్వ సంకలనాలు వెలువరించాడు

2016 లో ప్రభావర్మ కి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం సాధించి పెట్టిన శ్యామమాధవం ఒక కావ్యఖ్యాయిక. కావ్యఖ్యాయిక అంటే పద్య నవల లాంటిది. 15 అధ్యాయాలుగా విస్తరించిన నవల శ్రీకృష్ణుని చుట్టూ తిరుగుతుంది. ఇది చాలా మంది నమ్ముతున్నట్లుగా "ఇది పారవశ్యాల శ్రేణి కాదు ఇది వేదనల గని" అని ప్రభావర్మ అంటారు.

ఇది భగవాన్ శ్రీ కృష్ణుడి అంతరంగ వేదన. రామాయణంలో శ్రీ రామ చంద్రుడు మామూలు మనిషి.సగటు మనిషి అనుభవించే అన్ని కష్టాలు అనుభవించాడు. కానీ భారతం లో శ్రీ కృష్ణుడు అలా కాదు. దైవాంశ సంభూతుడు. అదే కృష్ణుడు మామూలు మనిషి అయి ఉన్నట్టయితే తన జీవితకాలం లో చేసిన కార్యాలకు ఎలాంటి అంతర్మధనానికి గురి అయి ఉండేవాడు. అతడి సంబంధాలు ఎలా ఉండేవి? తనను నిష్కల్మషంగా ప్రేమించిన, ఆరాధించిన రాధ పట్ల తన ప్రవర్తన ఎలా ఉండేది? ద్రౌపది ని ఎలా చూసేవాడు? లాంటి విషయాలు అన్నీ ఈ నవలలో ప్రాముఖ్యత ను సంతరించుకుంటాయి. కృష్ణుడి అంతరంగ మధనంతో మొదలయ్యే నవల అతడి స్వర్గారోహణ తో ముగుస్తుంది. ఈ మధ్య కృష్ణుడి పొప్పుకోళ్లు, పశ్చాత్తాపాలు అన్నీ పాఠకుడిని ఆకట్టుకుంటాయి. ఆలోచనలో పడవేస్తాయి. మారుతున్న కాలాల నేపథ్యం లో ఒక పురాణపురుషుడి ఆత్మిక ఒంటరితనానికి ప్రభావర్మ చాలా ప్రతిభావంతంగా అద్దం పట్టారు.

నీవు నన్ను పురుషుడిగా చూస్తావు
నేను నిన్ను స్త్రీగా చూస్తాను
కానీ నృత్యం ముందు
మనం ఇద్దరమూ ఒకటే అవుతాం

నేను రాధను అయినప్పుడు
నా గుండెలో కృష్ణుడు లేడు -
నేనే కృష్ణుడిని, నేనే రాధను

అందుకే నా పెదాలు వణుకుతాయి
నా నడుమ వంగుతుంది
నా కళ్లలో ఆశ్చర్యం నిండుతుంది

నన్ను ప్రేమించేటప్పుడు
నీవు ఎవరిని ప్రేమిస్తున్నావు?
ఈ పురుషుడినా... లేక ఈ స్త్రీనా?
లేక ఈ ఇద్దరి మధ్యలో
ఎప్పుడూ చిక్కుకుపోయిన బాలుడినా?



లాంటి ఆలోచనాత్మక కవిత్వ పంక్తులతో ఈ రచన మలయాళం లో చాలా సంచలనం సృష్టించింది కేరళ స్టేట్ లైబ్రరీ కౌన్సిల్ 2020లో శ్యామామాధవం పుస్తకాన్ని దశాబ్దపు ఉత్తమ పుస్తకంగాఎంపిక చేసింది శ్యామా మాధవం ఆంగ్లంలో లామెంట్ ఆఫ్ ది డస్కీ లార్డ్ అనే శీర్షికతో ప్రచురించబడింది.

"శ్యామమాధవం రాస్తున్నప్పుడు నాకు రాధాకృష్ణులు ఇద్దరూ ఒక్కరిగా కనిపించారు. ప్రేమలో లయం కావడమే, భగవంతునిలో ఐక్యం కావడం అని తెలుసుకున్నాను" అన్నారు ప్రభావర్మ

వర్మ మరొక రచన కనల్ చిలంబు. ఇది కూడా పద్య నవలే. ప్రేమ, కామం, కుట్ర, అధికారం, పగ, అశ్లీలతలతో కూడిన విషాద గాధ. ఇది చదువుతుంటే మనకు మహాభారతం లో ద్రౌపది గుర్తుకు వస్తుంది కానీ ఇది మహాభారతం రీ టెల్లింగ్ కాదు. కనల్ అంటే మండుతున్న అనీ, చిలంబు అంటే గజ్జె అని అర్థం. కనల్ చిలంబు అంటే మండుతున్న గజ్జె లేదా కాలుతున్న గజ్జె అని అర్థం చెప్పుకోవచ్చు. ఒక ఆధునిక ద్రౌపది. పేరు పద్మిని. ఆమె జీవితంలో ఐదుగురు పురుషులు. స్త్రీ శరీరం, ఆమె లైంగికత, రాజకీయం అన్నీ కలసి ఒక ప్రతీకారాగ్ని గా మారిన కథ. ప్రభావర్మ ఫెమినిజాన్ని ఒక ఆయుధంగా ఈ నవలలో మార్చారు. అందంగా, భయంకరంగా అన్నారు కొందరు విమర్శకులు. అతి శృంగారం, అతి హింస తో మళ్ళీ స్త్రీని ఒక ఆబ్జెక్ట్ గా చేశాడు అన్నారు మరికొందరు విమర్శకులు. ఎవరు ఏమన్నా కనల్ చిలంబు ఒక ప్రొఫెషనల్ డ్రామా గా రాష్ట్రం అంతటా 500 కి పైగా ప్రదర్శనలు అందుకుంది. "యాంక్లెట్ ఆఫ్ ఫైర్" పేరుతో ఆంగ్లం లోకి అనువదించబడింది

1
"నా గజ్జెలు మండుతున్నాయి
అవి నన్ను ఆడించడం లేదు -
నేను వాటిని ఆడిస్తున్నాను
అవి రాలిపోతే - నా పాదాలు రాలిపోతాయి"
2
"నన్ను చీర కట్టమని చెప్పినవాళ్లే
ఆ చీరను లాగారు
ఇప్పుడు నేను నగ్నంగా నిలబడి
అడుగుతున్నాను -
ఇది నా అవమానమా? నా శక్తా?"
3
"ప్రతీకారం ఒక స్త్రీ యొక్క రెండవ గర్భం
అందులో పుట్టేది బిడ్డ కాదు - మరొక అగ్ని"

లాంటి వాక్యాలు కనల్ చిలంబు లో పాఠకుడిని ఆగ్రహం లోకి, ఆలోచనలోకి, ఆశ్చర్యం లోకి ఒకేసారి నెట్టేస్తాయి

రౌద్ర సాత్వికం ప్రభావర్మ కి 2022 లో సరస్వతీ సమ్మాన్ పురస్కారం సాధించిపెట్టింది. రౌద్ర సాత్వికం అంటే రెండు భిన్న రసాలు, రెండు భిన్న తాత్వికతలు, రౌద్రం, శాంతం ఈరెండూ ఒకే కళాకారుడి లో ఎలా సంలీనం అవుతాయి? ఒకే మనిషి లో ఉంటే ఎలా ఉంటుంది? ఈ ప్రశ్నలకు జవాబును వెతుకుతుంది ఈ నవల

నవలలో కైలాసనాథ్ ఒక గొప్ప కథకళి కళాకారుడు. అతడు కేరళంలోని పురాతన కళాకారుల కుటుంబం నుండి వచ్చినవాడు.తన జీవితం లో రెండు పాత్రలు పోషిస్తాడు. ఒకటి రావణాసురుడు. రౌద్రం. శివుడు సాత్వికం. అతడు రావణాసురుడు పాత్ర పోషించేటప్పుడు రావణాసురుడిగా మారిపోతాడు. స్త్రీల మీద అఘాయిత్యాలు చేస్తాడు. అధికార దుర్వినియోగం చేస్తాడు. అదే కైలాసనాథ్ శివుడి పాత్ర పోషించినప్పుడు సాత్వికంగా మారిపోతాడు. శాంతి , కరుణలకు ప్రతిరూపం అవుతాడు. కళ /కళాకారుడు , రౌద్రం/ సాత్వికం, పురుషుడు/స్త్రీ ఈ ద్వంద్వాలను మనిషి ఎలా భరించాలి?ఎలా భరిస్తాడు? ఈ సంఘర్షణ కు ప్రతిరూపం ఈ నవల

1
"నేను రావణుడిని వేషం తీసినప్పుడు
నా పది తలలూ నిజమవుతాయి
నా ఇరవై చేతులూ నిజమవుతాయి
అప్పుడు నేను ఒక్క స్త్రీని మాత్రమే కాదు -
ప్రతి స్త్రీని ఎత్తుకుపోతాను"
2
"శివుడిగా నేను నటిస్తాను
కానీ నా గుండెలో రావణుడు నవ్వుతాడు
అతను నా గొంతులో కూర్చుని
'అర్ధనారీశ్వర' అని అరుస్తాడు -
సగం శివుడు, సగం రాక్షసుడు - ఇదే నేను"
3
"కళ ఎప్పుడు మనల్ని విడిచిపెట్టదు
మనం దాన్ని విడిచిపెట్టినా
అది మన రక్తంలో ఒక శాపంలా పాతుకుపోతుంది"

ఈ చిన్ని ఉటంకింపులు చాలు కదా నవల ఎంత అద్భుతంగా ఉంటుందో తెలుసుకోవడానికి
కవితలో నేను సత్యం చెప్పను. సత్యం నా కవిత నుండే పుడుతుంది అంటాడు ప్రభావర్మ
అని ప్రభా వర్మ చెప్పిన ఆ పంక్తి... అది ఆయన కవితా దర్శనం మొత్తాన్ని ఒక్క నిమిషంలో పట్టేస్తుంది.


నేను ముందు సత్యాన్ని కనుగొని, దాన్ని కవితలో పోసుకురావడం లేదు. కవిత రాస్తున్నప్పుడే సత్యం నా ముందు కనిపిస్తుంది - అది నాకూ ఆశ్చర్యం కలిగిస్తుంది, నన్ను కదిలిస్తుంది, కొన్నిసార్లు భయపెడుతుంది కూడా.

శ్యామ మాధవంలో బాల్య వేధింపు గురించి రాస్తున్నప్పుడు...
కనల్ చిలంబులో స్త్రీ ప్రతీకారం గురించి రాస్తున్నప్పుడు...
రౌద్ర సాత్వికంలో కళాకారుడి రాక్షసత్వం గురించి రాస్తున్నప్పుడు...
ప్రభా వర్మకు ముందే సమాధానాలు తెలియలేదు.
కవిత రాస్తూ రాస్తూ ఆ సత్యాలు ఆయన గుండెలోంచి రక్తంలా కారాయి.
అందుకే ఆయన ఒక ఇంటర్వ్యూలో ఇంకా స్పష్టంగా చెప్పారు
నేను కవిత రాసేటప్పుడు ఏ సత్యమూ ముందుగా తెలియదు.
రాసి పూర్తయ్యాకే నాకూ ఒక సత్యం దొరుకుతుంది.
అందుకే కవిత నాకు ఒక ఆవిష్కరణ... ప్రకటన కాదు.
ఈ ఒక్క వాక్యంలోనే ప్రభా వర్మ కవిత్వం ఎందుకు ఇంత శక్తివంతంగా ఉంటుందో అర్థమవుతుంది.
అది బోధలు చేయడం లేదు...
అది గాయాలను తవ్వుతూ, రక్తం కారుతూ, నిజాన్ని బయటకు తెస్తుంది
ముప్పైకి పైగా కవిత్వం, ఇతరేతర పుస్తకాలు ప్రచురించిన ప్రభావర్మ కేరళ లో అందుకొని అవార్డు లేదు. వర్మ తన "ఆరోడుం పరయుక వయ్యా" పాటకు 2019లో ఉత్తమ చలన చిత్ర గీతం గా 67వ జాతీయ చలనచిత్ర అవార్డును అందుకున్నప్పుడు, అతను రెండు దశాబ్దాల విరామం తర్వాత మలయాళానికి సాహిత్యానికి జాతీయ అవార్డును తీసుకుని వచ్చిన వాడుగా ప్రసిద్ధుడు అయ్యాడు.
రీతి భేదంగల్ ( విమర్శావ్యాసాలు,) సందేహియుడే ఏకాంత యాత్ర (జ్ఞాపకాలు)మలేషియన్ డైరీ కురిప్పుకల్ (ట్రావెలాగ్) లతో సహా అన్ని ప్రక్రియలనూ తన విద్వత్తు తో సుసంపన్నం చేసాడు

**- వంశీకృష్ణ, 95734 27422**

## నొప్పి లేని మరణం

వర్షమే కురవని నా నగరంలో
చెట్లు పొట్టిగా కాక ఇంకెలా పెరుగుతాయి చెప్పండి?
ఎండిన చెట్ల బెరడ్లు చర్మ రోగం వచ్చినట్లుగా
మంకీ పాక్స్ బొబ్బలతో మెరుస్తుంటాయి.
చిటికెన వేలంత మాత్రమే ఉండే ఆకులన్నీ
ఎండి రాలి పోతాయి.
దగ్ధమైన చెట్ల కళ్ళు కాస్తా మట్టితో చేసిన
దేవుడి బొమ్మ ముఖంలోని కళ్ళలా నిస్తేజంగా
మారిపోతాయి!
అచ్చం నా కూతురు బంక మట్టితో చేసే బొమ్మలా!
**
చెట్ల తలలకి నాలుకలు వేలాడుతుంటాయి.
నల్లని నాలుకలు ఎండిన చెరువు నోట్లోంచి
ఉబికి వస్తాయి.
వీచే గాలి కుళ్లిపోయిన చెట్ల కడుపుల్లోని
మీథేన్,హైడ్రోజన్ వాయువులతో బరువెక్కి
పోయి ఉంటుంది.
పగుళ్ళు వారిన చెట్ల వేళ్ళు మాత్రం ఇంకా
భూమి లోపలకి లోతుగా స్థిరంగా ఉండి పోతాయి.
దహించే సూర్య కిరణాలతో బంధించబడ్డ
వెంట్రుకలంత నాజూకు వేళ్ళతో ఉండే చెట్లన్నీ
ఇత్తడిలా కఠినమైన నీలి ఆకాశం నుంచి
కిందికి వేలాడుతూ ఉంటాయి.
బహుశా ఆ చెట్లన్నీ నొప్పి లేని మరణాన్ని
కోరుకుంటున్నట్లున్నాయి.



**మూల కవయిత్రి : మౌమితా ఆలం**
**అనుసృజన: గీతాంజలి**

## తిరిగి చూడు

నువ్వు నిలుచున్న నేల
పీల్చే గాలి దాహానికి నీరు
అన్నానికి ఆనందానికి పత్రహరితం
ఏవీ నీ ముందు ఏనాడు
చెయ్యి చాపలేదు
అవి మనకోసమే గాని
తమ కోసం ఎప్పుడూ
మోకరిల్ల లేదు
చెట్టు నుంచి పండుటాకుదూరమై
రేపటి చిగురును రమ్మంటుంది
ఎందుకో తెలుసా
నీలోని బూజుబుద్ధిని దులిపెయ్యనీకి.
భూమి శరీరాన్ని రైతు
పుండు పుండు దున్ని
ఎండుపుల్లల్ని ఏరేసి
తాను దండెం బొంగైపోతడు
ఎందుకో తెలుసా
నీ బతుకు పచ్చదనం చెయ్యనీకి

తన మొఖాన్ని కప్పేసిన గాలి
మురికి మేఘాల్ని తుడిచేసి
నీకు జీవ జలాన్నిస్తుంది
ఎందుకో తెలుసా
నీ ప్రాణాల్ని నిలుపనీకి.

కోపపు కోరల్ని నూరుతూ
తుఫాను దండెత్తినా
తప్పుతెలుసుకొని మెల్లగా
అలల తలల్ని దించుకుంటుంది
ఎందుకో తెలుసా
నీకు ప్రాశాంతతను పరవనీకి

ఒళ్ళు విరిచి కళ్లెర్ర జేసి
భూమి కంపించినా
సర్దుకొని శాంతిస్తుంది.
ఎందుకో తెలుసా
నీకు హాయి దుప్పటి కప్పనీకి

కిరణాల సలాకతో సూర్యుడు
ఎండను ఎగదోసినా
చినుకులరాక జూసి
మబ్బుల దుప్పట్లో దాగుంటడు
ఎందుకో తెలుసా
నీ మనసును ఐసుముంజే చేయ నీకి
ఎందుకు నీ గుండెను ఆవేశపు కొలిమిలో మాటి మాటికి
కాల్చేసు కుంటవు.
ఎవరో చెప్పిన సొల్లు వార్తలకు
పక్కింటికి గోడలు పెడతవు
కులాలుగా మతాలుగావర్గాలుగా
గీతలు గీసి అబద్ధపు
కూతలు కూసి
ప్రశాంత దేశాన్ని
దుఃఖ భూమిని చేస్తవు
ఎవరి కుర్చీ కోసమో
చిన్నప్పటి భుజంమీది చేయిని
వదులుకుంటవు
ఎవరి పవరు కోసమో
బి పి ని చెమటలో ముంచి
మంచంలో మూల్గుతవు.
డిగ్రీలు చూసుకుంటూ
ఏడుస్తున్న యువత
చుట్టూ తోడేళ్లను తప్పించుకు తిరిగే మహిళ
మోసపు తక్కెడను చూసి
తలగొట్టుకునే రైతు
ఖాళీ చేతుల్ని వెక్కిరిస్తున్న కూలీల కడుపులు
వీళ్ల కల్లోల బతుకు చిత్రాన్ని
ఎప్పుడైనా చూశావా!
పోనీ వీళ్ళూ మన వాళ్ళేనని
ఒక్కసారైనాఇటుతిరిగిచూసివా
తిన్నది అరగనీకి
పనికి రాని ద్వేషాన్ని పెంచుకోకు

మొక్కల స్వతంత్రాన్ని చూసి
పిట్టల ఆనందాన్ని చూసి
నీది నువ్వే నీదైన జీవితాన్ని
నిర్మించుకో
నీ స్వేచ్ఛా జీవన కాన్వాసుపై
కొత్త సంతకాన్ని ముద్రించుకో

**- డా. ఉదారి నారాయణ**
**94414 13666**




## బానిసకు బానిస

నేను శత్రు శిబిరంలో శరణార్థిని
నా జీవితం నిర్ణయాత్మక వెలివాడ
నా గాయం తడి ఆరిన ఎడారి
నా గళం అనివార్య యుద్ధాల నడుమ
ఆత్మగౌరవ గీతాలాపన
నా కలం అస్తిత్వ ప్రసవాల ఆర్తనాదం
నాకు పాఠకులుండరు
ప్రేక్షకులు కూడా ఉండరు
నిత్యం పహారా కాస్తూ నా చుట్టూ శత్రు సైన్యం
నా అవసరాల ఉనికి ఉండదు
నా హక్కుల చర్చ ఉండదు
నా ఊహలను, వ్యూహాలను దోచుకొని
మరొకరి విజయ గాథల ప్రచారం నిత్యం
సముద్ర ఘోష నడుమ నా బృందం భజన
నా నాయకుడు చెంచాలకు గ్లాసులందిస్తూ ఒకసారి
గాజులందిస్తూ మరొకసారి
మురికి గుంటల్లో దొర్లుతుంటాడు
నా సహచర బృందం అరమోడ్పు కన్నులతో
నా చరిత్రను తాకట్టు పెడుతూ జాతర చేస్తారు
నేను శత్రు శిబిరంలో శరణార్థిని
ఒకప్పుడు నేనొక బానిసకు బానిసను
నేనొక బీసీని
నాజాతి ఉద్యమాల పోరులో ప్రజ్వలిస్తుండగా
ఇప్పుడు నేను వాటా అడిగే ప్రశ్నను.
రాజ్యాధికార సాధనే నా బాట

**- జ్వలిత, 9989198943**




# వాలంటీర్ల సర్వేలో వెలుగుచూసిన జీవవైవిధ్యం

## ములుగు మన్యంలో 85 అరుదైన సీతాకోకచిలుక జాతులున్నాయన్న తాజా సర్వే

**మహా :** రంగురంగుల సీతాకోక చిలుకలు తెలంగాణ అడవుల్లో మళ్లీ రెక్కలు విప్పుతున్నాయి. దేశంలో తొలిసారిగా నిర్వహించిన భారీ బట్టర్‌ఫ్లై కౌంట్ సర్వే తెలంగాణ అడవుల్లో దాగి ఉన్న జీవవైవిధ్యాన్నివెలుగులోకి తెచ్చింది.

**ఎన్ని జాతులున్నాయంటే...**

జీవవైవిధ్యానికి ప్రతీకలైన సీతాకోక చిలుకలపై దేశంలోని పది రాష్ట్రాల్లో వాలంటీర్లు మొట్టమొదటి సారి సర్వే చేశారు. ఈ సర్వేలో రంగురంగుల పలు జాతుల సీతాకోక చిలుకలు, అరుదైన జాతులు వెలుగుచూశాయి. ప్రపంచవ్యాప్తంగా 17,500 రకాల జాతుల సీతాకోకచిలుకలున్నాయని ప్రపంచ బట్టర్ ఫ్లై కన్జర్వేషన్ సొసైటీ చెబుతోంది. భారతదేశంలో 1500 కు పైగా జాతుల సీతాకోకచిలుకలుండగా, వీటిలో 43 రకాల జాతుల సీతాకోకచిలుకలు అంతరించి పోయే ప్రమాదంలో ఉన్నాయని తేల్చారు. మనసుకు ఆహ్లాదాన్ని అందించే బట్టర్ ఫ్లైలను పరిరక్షించాలనే లక్ష్యంతో మొదటి సారి తెలంగాణలోని ఏటూరునాగారం అడవులతోపాటు పది రాష్ట్రాల్లో బిగ్ బట్టర్ ఫ్లై కౌంట్ పేరిట సర్వే చేసి నివేదిక రూపొందించామని అటవీశాఖ వైల్డ్ లైఫ్ ఓఎస్డీ ఎ శంకరన్ చెప్పారు.

**సీతాకోక చిలుకల సందడి**

అడవిలో రంగురంగుల సీతాకోక చిలుకలు...పూల మొక్కలపై వాలుతూ... రివ్వున ఎగురుతూ సందడి చేస్తున్నాయి. బట్టర్ ఫ్లై ప్రేమికులు వాలంటీర్లుగా మారి... కాళ్లకు షూ ధరించి...భుజాన బ్యాగు వేసుకొని... బైనాక్యులర్స్...మెడలో లెన్స్ కెమెరాలతో దట్టమైన అడవిలో కాలిబాటల్లో తిరుగుతూ అరుదైన సీతాకోక చిలుకలను తమ కెమెరాల్లో బంధించారు. తెలంగాణ అటవీశాఖ, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ, వరల్డ్ వైల్డ్ ఫండ్ ఫర్ నేచర్ పర్యావరణ వేత్తలు, వాతావరణ అధ్యయన నిపుణులు, వాలంటీర్లు ఏటూరునాగారం అభయారణ్యంలో బట్టర్ ఫ్లై సర్వే చేశారు. ఈ సర్వేతో ములుగు జిల్లాకు ప్రాధాన్యం ఏర్పడింది.ఈ సర్వేలో పాల్గొన్న వాలంటీర్లకు అటవీశాఖ సర్టిఫికెట్లను ప్రదానం చేసింది. ఈ మొదటి సీతాకోకచిలుక సర్వే తెలంగాణలో జీవవైవిధ్య పర్యవేక్షణ, పరిరక్షణ పరిశోధన, పర్యావరణ వ్యవస్థకు కీలకమైన బేస్‌లైన్ డేటాను అందించిందని అటవీ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కల్యాణపు సుమన్ చెప్పారు.


**తెలంగాణలో 145, ఏటూరునాగారంలో 85 రకాల జాతులు**

తెలంగాణ రాష్ట్రంలోని అడవుల్లో 145 రకాలు, ఏటూరునాగారం మన్యంలో 85 రకాల జాతుల సీతాకోక చిలుకలున్నాయని తాజాగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.లక్నవరం అటవీ ప్రాంతంలో జీవవైవిధ్యానికి ప్రతీకలైన రంగురంగుల సీతాకోక చిలుకలు తన సర్వేలో కనిపించాయని హైదరాబాద్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉద్యోగిని అపరంజని చెప్పారు. తెలంగాణలో ఎన్నెన్నో అడవుల్లో ప్రకృతి అందాలను తిలకించవచ్చని ఆమె పేర్కొన్నారు.

**పూలపై వాలిన సీతాకోకచిలుకలు**

వివిధ జాతులు, రంగురంగుల బట్టర్ ఫ్లైలు పూలపై వాలినపుడు చూస్తే తన మనసు ఆనందంతో నిండుతుందని వాలంటీర్లు సర్వే అనుభూతులను పంచుకున్నారు. ములుగు మన్యంలో సీతాకోక చిలుకలతో తాను ఆల్బం రూపొందిస్తున్నానని బెంగళూరుకు చెందిన వాలంటీర్ బృందా చెప్పారు. పూలపై వాలిన బట్టర్ ఫ్లైలను చూస్తే మనసు పులకరించిందని ఆమె పేర్కొన్నారు. పచ్చని ఎత్తైన చెట్లు...వివిధ రకాల పూల మొక్కలు...వాటిపై వాలిన సీతాకోక చిలుకలను వాలంటీర్ల తమ కెమెరాల్లో క్లిక్ మనిపించారు. బట్టర్ ఫ్లై సర్వే కాదని వాటిని కాపాడేందుకు తాము చేపట్టిన కార్యక్రమం అని వాలంటీర్ గంజి మారయ్య చెప్పారు.

**రంగురంగుల సీతాకోక చిలుకలు...**

ములుగు జిల్లా ఏటూరునాగారం వన్యప్రాణుల అభయారణ్యం రంగురంగుల సీతాకోక చిలుకల సందడితో రంగుల మయంగా మారింది. ఏడు రాష్ట్రాల నుంచి వాలంటీర్లు తెలంగాణ అటవీ శాఖ నిర్వహించిన మొదటి సీతాకోకచిలుక సర్వేలో పాల్గొన్నారు. వణికిస్తున్న చలిలో తెలంగాణలోని మన్యంలో సీతాకోకచిలుకలను లెక్కించడం వాలంటీర్లకు మర్చిపోలేని మధుర స్మృతులను మిగిల్చింది. బట్టర్ ఫ్లైల ఉనికి పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యానికి మంచి సూచిక అని ములుగు జిల్లా అటవీ అధికారి రాహుల్ జాదవ్ చెప్పారు. తెలంగాణానే కాదు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోని టైగర్ రిజర్వ్‌లలో ఇంతకు ముందు ఇలాంటి సర్వేలలో పాల్గొన్న అనుభవం ఉన్నవారు, అభయారణ్యంలో గుర్తించిన ప్రాంతాల్లో రోజుకు రెండుసార్లు, ఉదయం, సాయంత్రం ఈ సర్వే సాగింది. వాలంటీర్లు నలుగురు లేదా ఐదుగురు బృందాలుగా ఏర్పడి సీతాకోకచిలుకలు కనిపించే ప్రదేశాలను గుర్తించి, వాటిని లెక్కించి, ఈ కీటకాల చిత్రాలతో హ్యాండ్ గైడ్‌ని రూపొందించారు.

**అంతరించి పోతున్న జాతులు**

వైల్డ్ లైఫ్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియా పెంచ్ టైగర్ రిజర్వ్, కన్హా అభయారణ్యాల్లోనూ బట్టర్ ఫ్లై సర్వే చేశారు. అడవుల్లో సీతాకోక చిలుకల సంఖ్య తగ్గిపోతుండటంతోపాటు కొన్ని జాతులు అంతరించి పోతున్న నేపథ్యంలో తాము బట్టర్‌ఫ్లై ఎమర్జెన్సీని ప్రకటించామని అటవీశాఖ అధికారులు చెప్పారు. చాలా రాష్ట్రాల్లోని అడవుల్లో బట్టర్ ఫ్లై జాతులు అంతరించి పోతున్నాయని తాజా సర్వేలో తేలింది. మాండ్‌సౌర్‌లోని గాంధీసాగర్ అభయారణ్యంలో వైల్డ్ వారియర్స్ బృందం నిపుణులు 45 జాతుల సీతాకోక చిలుకలను నమోదు చేశారు.

**సీతాకోక చిలుకల సర్వే చిరస్మరణీయం**

ఒక్క గాంధీసాగర్ వాతావరణంలో సీతాకోక చిలుకల సంతతి పెరిగి జీవవైవిధ్యం వృద్ధి చెందిందని తేలింది. మహారాష్ట్రలోని గడ్చిరోలిలోని చప్రాలా, తాడోబా వన్యప్రాణుల అభయారణ్యాల్లో సీతాకోకచిలుక సర్వేలో పాల్గొనడం ఒక చిరస్మరణీయ అనుభవమని వాలంటీర్లు చెప్పారు.ఆకురాల్చే అడవిలో సీతాకోకచిలుకలను చూడటం నిజంగా మనోహరంగా ఉందని వాలంటీర్లు పేర్కొన్నారు. పది రాష్ట్రాల నుంచి 139 మంది వాలంటీర్లు ఉత్సాహంతో సీతాకోక చిలుకల సర్వేలో పాల్గొన్నారు. ఈ సర్వే జీవవైవిధ్యం , పౌర విజ్ఞాన వేడుకగా మారింది. స్వచ్ఛంద సేవకులు అనేక జాతుల సీతాకోకచిలుకలను డాక్యుమెంట్ చేశారు.ముంబయి బట్టర్ ఫ్లై క్లబ్ సభ్యులు తాజాగా మలబార్ హిల్స్ పై బట్టర్ ఫ్లై వాక్ చేశారు.

**పర్యావరణ ఆరోగ్యానికి జీవ సూచికలు...**

అడవుల్లో రెపరెపలాడే ఈ చిన్న జీవులు కేవలం రంగుల విందు కాదు...మన పర్యావరణ ఆరోగ్యానికి జీవ సూచికలు. సీతాకోక చిలుకలను లెక్కించిన ఈ సర్వేతో వాలంటీర్లు అధ్యయనం మాత్రమే చేయలేదు, అడవులను రాబోయే తరాలకు కాపాడే మహోత్తర జాగృతి మొదలు పెట్టారు. దేశంలోని పది రాష్ట్రాల్లో ఒకే లక్ష్యంతో కలిసి పనిచేసిన వాలంటీర్లు చూపించిన మార్గం ఇక జీవవైవిధ్య సంరక్షణలో నూతన అధ్యాయానికి నాంది. ఈ సీతాకోక చిలుకల రెపరెపలు ఇప్పుడు పరిశోధనలకు, సంరక్షణకు దిక్సూచిలా మారాయి.

## నూతన డీసీసీ అధ్యక్షుడికి కాంగ్రెస్ నేతల అభినందనలు



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా నియామకమై ఆదిలాబాద్ జిల్లాకు చేరుకున్న నరేష్ జాదవ్ ను స్థానిక కాంగ్రెస్ శ్రేణులు కలిసి అభినందనలు తెలిపారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆయన నివాసంలో కలిసి అభినందించారు.పూల బొకే శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,లోక ప్రవీణ్ రెడ్డి, నర్ర విట్టల్, దర్శనాల లక్ష్మణ్, ఎంఏ షకీల్, రఫీక్, అల్లూరి భూమారెడ్డి, సింగిరెడ్డి రాంరెడ్డి, మహంకాళి అజయ్, ప్రశాంత్, శ్రీలేఖ, ఖలీం, వంగర్ జీవన్, డేరా కృష్ణా రెడ్డి తదితరులున్నారు.

## నేడు మంత్రి జూపల్లి పర్యటన



**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక శాఖ , ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం ఆదిలాబాద్ , నిర్మల్ జిల్లాలలో పర్యటించనున్నారు.ఆదివారం రాత్రే జిల్లాకు చేరుకుంటారు. సోమవారం ఉదయం 9 గంటలకు పెన్ గంగా అతిథి గృహం నుండి బయలుదేరి 9 గంటల 10 నిమిషాలకి కైలాష్ నగర్ లోని పీడబ్ల్యూడీ భవనానికి ప్రారంభించనున్నారు. 930 నుండి 10 గంటల వరకు పట్టణంలోని 3,4 వార్డులలో ఇందిరమ్మ ఇండ్ల ను ప్రారంభిస్తారు.ఉదయం 1020కి ఆదిలాబాద్ నియోజకవర్గంలోని మహిళలకు స్థానిక ఎస్టీయూ భవన్ లో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనున్నారు. అనంతరం గుడిహత్నూర్ నుండి లింగాపూర్ మీదుగా మాన్కాపూర్ వరకు 3కోట్ల 55 లక్షలతో చేపట్టే బీటీ రోడ్డు పనులకు శంఖుస్థాపన చేయనున్నారు.సొనాల మండల కేంద్రంలో 93 లక్షల 60వేలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు శంఖు స్థాపన చేస్తారు.అనంతరం మధ్యాహ్నం 1230కు బోథ్ మీదుగా నిర్మల్ జిల్లాకు చేరుకుంటారు. జిల్లాలోని పోచం పాడ్, భైంసా లో పర్యటించి పలు ప్రారంభోత్సవాలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేయనున్నారు.

## మహిళల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం



### బీర్ల అయిలయ్య ప్రభుత్వ విప్

**తుర్కపల్లి, మహా:** మహిళలు ఆత్మగౌరవంతో ముందుకెళ్లాలని, మహిళల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే రాష్ట్రంలో ప్రవేశ పెడుతున్న ప్రతీ సంక్షేమ పథకం మహిళల పేరిట అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండలం జడ్పీహెచ్ఎస్ స్కూల్ లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ...కోటిమంది మహిళలు కోటీశ్వరులు కావాలనే ఆలోచనతో ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం ఆలోచన అని అన్నారు. రెండు విడతలుగా అర్హులైన 18సం.రాలు నిండిన ప్రతి మహిళకు ఎంతో ఆకర్షణీయంగా నాణ్యతతో కూడిన నీలం రంగు చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని, చీర కట్టుకున్న ప్రతి మహిళ మహాలక్ష్మిలా ఉండాలన్నారు. గొప్పోలు, ధనికులు, పేదలు అనే తేడా లేకుండా ప్రతి మహిళలకు ఒకటే చీర ఇస్తున్నామన్నారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎన్నలేని ప్రాధాన్యతని ఇస్తుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని సంకల్పంతో మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. అందులో బాగంగా మహిళలకు రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లిన ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లు ఉచిత కరెంటు, 500 కే వంట గ్యాస్, మహిళల పేరు మీదనే ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు,పెట్రోల్ బంకు ఓనర్లుగా, కాంట్రాక్టర్లుగా మారి ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఎదగాలని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నామన్నారు. ధనికులు ఏ బియ్యం తో అయితే తింటున్నారో అని ఆలోచించి ప్రతి పేద కుటుంబం కడుపు నిండా తినాలనే ఆలోచనతో ప్రతి మనిషికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. మహిళలను ఇలా అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ.. మహిళలు నచ్చినటువంటి, మెచ్చినటువంటి నీలం రంగు చీరలను అందుకుంటున్న ప్రతి మహిళకి ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. నీలం రంగు అంటే ఆకాశం రంగు అని ఆలోచించి మహిళలు ఆకాశమంత ఎత్తు ఎదగాలని ప్రభుత్వం భావించి అద్భుతమైన డిజైన్, క్వాలిటీతో ఇందిరమ్మ చీరలు ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. మంచి చీర కట్టుకుంటే ఆరోజు ఒక ఆత్మవిశ్వాసంతో పని చేయడానికి ఎంతో గర్వకారణం అన్నారు. మహిళలు ఎక్కడైనా మీటింగులు, ఇతరత్రా ప్రోగ్రాంకు వెళ్లేటప్పుడు అందరూ ఒకే చీర కడితే అది ఒక అద్భుత కళ అన్నారు. ప్రభుత్వం ఏ పని చేసినా మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ఉచిత కరెంటు, పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ ఇండ్లు, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళ ఆర్థికంగా ఎదిగితే ఇల్లు సక్రమంగా ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడంలో రాష్ట్రంలో ఆలేరు నెంబర్ 1 స్థానంలో ఉందన్నారు. స్థానిక శాసనసభ్యులు చొరవతో ఎవరైతే ఇందిరమ్మ ఇల్లు త్వరగా పూర్తి చేసుకున్నారో వారి ఇంటి గృహప్రవేశానికి ఒక ఆట ఇచ్చి బట్టలు పెట్టి ఇంటి మనిషిలా ఉంటున్నారన్నారు. ప్రతి మహిళకు చీరలు అందుతాయని , ఎవరు కూడా రాలేదని చింతించొద్దన్నారు. రెండు విడుదలుగా 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు చీరలు అందుతాయన్నారు. అనంతరం ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ ,సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, తాసిల్దార్ జల కుమారి, మండల్ స్పెషల్ అధికారి జానయ్య, ప్రజా ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు








## తోపుదుర్తి సోదరుడి కుమార్తె వివాహానికి హాజరైన వైయస్ జగన్

అనంతపురం జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ హాజరయ్యారు. రాప్తాడు జాతీయ రహదారి సమీపంలో జరిగిన వివాహ వేడుకలో నూతన వధూవరులు మోక్షిత విష్ణుప్రియా రెడ్డి, తేజేష్ రెడ్డిలకు వివాహ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.



# క్రాష్ మొదలైంది.. బంగారం, వెండి కొనుగోలుకిదే సమయం



పెట్టుబడులు, ఆర్థిక విషయాలపై ఎప్పకప్పుడు వ్యాఖ్యానించే 'రిచ్ డాడ్ పూర్ డాడ్' పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి తాజాగా మరో హెచ్చరికను జారీ చేశారు. "చరిత్రలో అతిపెద్ద క్రాష్" ప్రారంభమైందంటూ సోషల్ ప్లాట్ ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 2013లో తాను ప్రచురించిన పుస్తకం రిచ్ డాడ్స్ ప్రొఫెసీని ప్రస్తావిస్తూ దశాబ్దం క్రితం తాను అంచనా వేసిన ప్రపంచ మాంద్యం ఇప్పుడు బయటపడుతోందని, ఇది ఒక్క అమెరికాను మాత్రమే కాకుండా యూరప్, ఆసియాను కూడా ప్రభావితం చేస్తుందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో వేగవంతమైన పురోగతి ఉద్యోగాలను ఊడ్చేస్తుందని, ఇది జరిగితే వాణిజ్య, నివాస రియల్ ఎస్టేట్ రెండింటిలోనూ భారీ పతనం తప్పదని రాబర్ట్ కియోసాకి నమ్ముతున్నారు.

**బంగారం, వెండి.. కొనాల్సిందిప్పడే..**

తన దీర్ఘకాల పెట్టుబడి అభిప్రాయాలను పునరుద్ఘాటిస్తూ, కియోసాకి బంగారం, వెండి, బిట్ కాయిన్, ఎథేరియం హోల్డింగ్స్ ను పెంచుకోవాల్సిన సమయం ఆసన్నమైందని తన ఫాలోవర్లకు సూచించారు. ముఖ్యంగా ఈ పరిస్థితిలో వెండి కొనడం ఉత్తమం, సురక్షితమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక ఔన్స్‌కు 50 డాలర్ల వద్ద ఉన్న వెండి (Silver Price) త్వరలో 70 డాలర్లకి పెరుగుతుందని, 2026 నాటికి అయితే 200 డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేశారు.

### ధనవంతులవుతారు!

**"శుభవార్త ఏమిటంటే, లక్షలాది మంది తమ సంపదను పోగుట్టుకుంటున్నా... మీరు సిద్ధంగా ఉంటే... ఈ క్రాష్ మిమ్మల్ని ధనవంతులను చేస్తుంది"అని కియోసాకి రాసుకొచ్చారు. ఈ క్రాష్ నుంచి సంపన్నులు అయ్యేందుకు మరిన్ని మార్గాలను రానున్న ట్వీట్‌లలో వివరిస్తానన్నారు.**



# షఫాలీ వర్మ కొత్త స్పోర్ట్స్ కారు.. ధర ఎంతో తెలుసా?

ఐసీసీ మహిళల ప్రపంచ కప్ 2025 విజయం సాధించిన తరువాత.. షఫాలీ వర్మ కొత్త ఎంజీ సైబర్‌స్టర్ కారును కొనుగోలు చేశారు. మూడు ఫార్మాట్లలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన అతి పిన్న వయస్కురాలైన మహిళల్లో ఒకరైన వర్మ.. 2025లో ప్రపంచ కప్ గెలుచుకున్న జట్టులో భాగంగా ఉండటంతో పాటు 2023 ఆసియా కప్ & 2023 U19 T20 ప్రపంచ కప్‌ను గెలుచుకోవడం ద్వారా ఆటలో గణనీయమైన విజయాన్ని సాధించారు. ఇక ఈమె కొనుగోలు చేసిన కారు విషయానికి వస్తే..

### ఎంజీ సైబర్‌స్టర్

**సైబర్‌స్టర్ అనేది ప్రపంచ మార్కెట్‌కు ఎంజీ మోటార్ కంపెనీకి చెందిన మొట్టమొదటి రోడ్‌స్టర్. దీనిని సంస్థ ప్రీమియం డీలర్‌షిప్లలో మాత్రమే M9 ఎలక్ట్రిక్ MPVతో విక్రయిస్తోంది. జూలై 2025లో అమ్మకానికి వచ్చినప్పటి నుంచి.. సైబర్‌స్టర్‌కు మంచి ఆదరణ లభించింది. ఈ కారు మొదటి రెండు నెలల్లో 250 యూనిట్లకు పైగా అమ్ముడయ్యాయని కంపెనీ తెలిపింది. కాగా ఈ కారు కోసం ఇప్పుడు వెయిటింగ్ పీరియడ్ నాలుగు నెలలు కావడం గమనార్హం. భారతదేశంలో ఎలక్ట్రిక్ ఎంజీ రోడ్‌స్టర్ ఒకే వేరియంట్‌లో అందుబాటులో ఉంది. ఇది డ్యూయల్ మోటార్ AWD పవర్‌ట్రెయిన్‌ను కలిగి ఉంటుంది. ఇది 77 kWh బ్యాటరీతో 528 bhp & 725 Nm టార్క్ అందిస్తుంది. ఇది పూర్తి ఛార్జ్‌పై 580 కి.మీ వరకు ప్రయాణించగలదని కంపెనీ పేర్కొంది. మంచి డిజైన్ పొందిన ఈ కారు.. టాప్ రూఫ్‌తో సరైన స్పోర్ట్స్ కారు మాదిరిగా కనిపిస్తుంది. క్యాబిన్ స్టీరింగ్ వెనుక ట్రై-స్క్రీన్ డిస్ప్లేతో డ్రైవర్-సెంట్రిక్ లేఅవుట్‌ను కూడా ఉంది. బోస్ ఆడియో సిస్టమ్, ఆపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటోతో కూడిన 7.0 ఇంచెస్ టచ్‌స్క్రీన్ వంటివి ఈ కారులో ఉన్నాయి. సైబర్‌స్టర్ EV ప్రస్తుతం ధర రూ. 75 లక్షలు (ఎక్స్-షోరూమ్).**

# రూ. లక్ష కంటే ఖరీదైన ఐఫోన్.. సగం ధరకే!



యాపిల్ కంపెనీ ఎప్పటికప్పుడు కొత్త స్మార్ట్‌ఫోన్‌లను పరిచయం చేస్తూనే ఉంది. ఇందులో భాగంగానే సంస్థ ఐఫోన్ ఎయిర్ తీసుకొచ్చింది. దీని ధర రూ. 1,19,900. కానీ బ్లాక్ ఫ్రైడే సేల్‌లో ఈ ఫోన్ కేవలం 54,900 రూపాయలకే లభించనుంది. అంటే.. రూ. 65,000 తగ్గుతుందన్నమాట. నవంబర్ 22 నుంచి ప్రారంభమైన నవంబర్ 30 వరకు సాగే బ్లాక్ ఫ్రైడే సేల్‌లో.. ఐఫోన్ ఎయిర్ మొబైల్ తక్కువ ధరలకు అందుబాటులో ఉండనుంది. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. బ్యాంక్ ఆఫర్స్, ఇతరత్రా ఆఫర్స్ పొందినట్లయితే మీకు రూ. 65000 తగ్గుతుందన్నమాట.

**ఐఫోన్ ఎయిర్ స్పెసిఫికేషన్స్**


యాపిల్ ఐఫోన్ ఎయిర్ 6.5 ఇంచెస్ OLED ప్యానెల్ పొందుతుంది. 120Hz రిఫ్రెష్ రేట్ పొందిన ఈ ఫోన్ 3,000 నిట్స్ పీక్ అవుట్ డోర్ బ్రైట్‌నెస్ పొందుతుంది. ఇందులో యాపిల్ ప్రత్యేక 7లేయర్ యాంటీరిఫ్లెక్టివ్ కోటింగ్ అందించింది. ఐఫోన్ ఎయిర్ A19 ప్రో చిప్‌సెట్‌పై నడుస్తుంది, ఇది ఐఫోన్ 17 ప్రో మరియు ఐఫోన్ 17 ప్రో మాక్స్‌లో ఉపయోగించిన అదే శక్తివంతమైన ప్రాసెసర్. 48 మెగాపిక్సెల్ ఫ్యూజన్ రియర్ కెమెరా, ముందు భాగంలో, 18 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా ఉన్నాయి. ఇది స్పేస్ బ్లాక్, క్లౌడ్ వైట్, లైట్ గోల్డ్ & స్కై బ్లూ అనే నాలుగు రంగుల్లో లభిస్తుంది.

# బైకర్ల కోసం ఎయిర్‌బ్యాగ్: ప్రమాదంలో సేఫ్!

ప్రమాదంలో ప్రాణాలను కాపాడంలో ఎయిర్ బ్యాగులు ప్రధాన పాత్ర వహిస్తాయి. అయితే ఎయిర్ బ్యాగ్స్ కార్లలో మాత్రమే అందుబాటులో ఉంటాయి. కాబట్టే, కారు ప్రమాదానికి గురైనప్పుడు ప్రయాణికులు కొన్నిసార్లు ప్రాణాలతో బయటపడతారు. బైక్ రైడర్లకు కూడా ఎయిర్ బ్యాగ్స్ ఉంటే?, ఎంతబాగుంటుందో కదా.. దీనిని దృష్టిలో ఉంచుకునే నియోకవాచ్ కంపెనీ మొదటిసారి బైకర్స్ కోసం ఎయిర్‌బ్యాగ్ లాంచ్ చేసింది. దీనికి ధర ఎంత?, ఇదెలా ఉపయోగపడుతుంది? అనే ఆసక్తికరమైన విషయాలను ఈ కథనంలో వివరంగా చూసేద్దాం.

**100 మిల్లీ సెకన్లలోపు**

బైక్ రైడర్ల భద్రత కోసం.. ఇండోఫ్రెంచ్ జాయింట్ వెంచర్ అయిన నియోకవాచ్, నియోకవాచ్ ఎయిర్ వెస్ట్‌ను ప్రవేశపెట్టింది. ఇది బైకర్స్ కోసం రూపొందించిన భారతదేశంలోని మొట్టమొదటి ఎయిర్‌బ్యాగ్ సిస్టం. ప్రమాదం జరిగినప్పుడు రైడర్ ఛాతీ, వెన్నెముక, మెడ వంటి భాగాలను ఇది రక్షిస్తుంది. ఈ ఎయిర్‌బ్యాగ్ ప్రమాదం జరిగినప్పుడు కేవలం 100 మిల్లీ సెకన్లలోపు యాక్టివేట్ అవుతుంది. ముఖ్యమైన ప్రాంతాలకు కుషనింగ్ అందిస్తుంది. సాధారణంగా కారులో ప్రయాణించే వారితో పోలిస్తే.. మోటార్‌సైకిల్‌పై ప్రయాణించేవారికి ప్రమాదంలో తీవ్ర గాయలయ్యే అవకాశం ఎక్కువ. కాబట్టి ఇలాంటి వాటిని నివారించడానికే ఈ నియోకవాచ్ ఎయిర్ వెస్ట్ వచ్చింది.



**భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా**

ఎలక్ట్రానిక్ ఎయిర్‌బ్యాగ్ సిస్టమ్‌ల మాదిరిగా కాకుండా.. నియోకావాచ్ ఎయిర్ వెస్ట్ ఛార్జింగ్, బ్యాటరీలు లేదా సబ్‌స్క్రిప్షన్‌ల అవసరం లేని సరళమైన మెకానికల్ టెథర్ ట్రిగ్గర్‌ను ఉపయోగిస్తుంది. దీనిని రీసెట్ చేయవచ్చు. డిప్లాయ్‌మెంట్ తర్వాత తిరిగి ఉపయోగించవచ్చు. దీనిని రోజువారీ ప్రయాణంలో కూడా ఉపయోగించుకోవచ్చు. ఇది తేలికైనది కావడంతో రైడర్లకు అసౌకర్యంగా ఉండే అవకాశం లేదు. అంతే కాకుండా.. ఇది ప్రపంచ భద్రతా ధృవీకరణ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుంది.

**మొత్తం మూడు**

నియోకావాచ్ ఎయిర్ వెస్ట్ (రూ. 32,400) మాత్రమే కాకుండా.. కంపెనీ నియోకవాచ్ టెక్ బ్యాక్‌ప్యాక్ ప్రో (రూ. 40,800), నియోకవాచ్ టెక్‌ప్యాక్ ఎయిర్ (రూ. 36,000) లను కూడా ప్రవేశపెట్టింది. ఈ మూడు ఉత్పత్తులు ఇప్పుడు నియోకావాచ్ అధికారిక వెబ్‌సైట్‌లో & భారతదేశం అంతటా ఎంపిక చేసిన అధీకృత రిటైలర్లలో కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉన్నాయి.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# యాక్సిస్ బ్యాంక్ శాలరీ ప్రోగ్రాం: వారికోసమే..

అంకుర సంస్థల ఉద్యోగుల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా తమ న్యూ ఎకానమీ గ్రూప్ (ఎన్ఈజీ) విభాగం కింద క్యూరేటెడ్ కార్పొరేట్ శాలరీ ప్రోగ్రాంను ప్రవేశపెట్టినట్లు ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. జీరో-బ్యాలెన్స్ సేవింగ్స్ అకౌంట్, సమగ్ర బీమా కవరేజీ, ఎక్స్‌క్లూజివ్ క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన రుణాలు మొదలైన ప్రయోజనాలు ఇందులో ఉంటాయని వివరించింది. అలాగే, ఖాతాను బట్టి ఉద్యోగులకు వార్షికంగా రూ. 46,000 నుంచి రూ. 2.4 లక్షల వరకు ఆదా చేసే స్విచ్ టు సేవ్ ఫీచర్ కూడా ఉంటుందని బ్యాంక్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ విజయ్ మూల్‌బగల్ తెలిపారు. ప్రధానంగా జెన్ జెడ్, జెన్ ఆల్ఫా ఉద్యోగుల కోసం దీన్ని ఉద్దేశించినట్లు పేర్కొన్నారు.




# వచ్చే ఎన్నికల్లో డీఎంకే చిత్తుగా ఓడిపోవడం ఖాయం: విజయ్

**చెన్నై:** కరూర్‌లో జరిగిన తొక్కిసలాట దుర్ఘటన తర్వాత కొన్ని నెలలు సుదీర్ఘ విరామం తీసుకున్న టీవీకే పార్టీ అధినేత, సినీనటుడు విజయ్.. తన రాజకీయ ప్రచారాన్ని తిరిగి ప్రారంభించారు. నేడు(ఆదివారం, నవంబర్ 23 వ తేదీ) కాంచీపురం జిల్లాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇండోర్‌లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దానికోసం కాంచీపురంలోని ఓ ప్రైవేటు కాలేజీ ప్రాంగణంలో సదస్సు ఏర్పాటు చేశారు. కేవలం 2000 మందికి మాత్రమే QR కోడ్ పాస్‌లతో కూడిన అనుమతి ఇచ్చారు. అనుమతి లేని వారికి ప్రవేశం లేకుండా పకడ్బందీ ప్లానింగ్ చేశారు. ప్రచార పునఃప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార డీఎంకే, కేంద్ర బీజేపీ ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సమావేశంలో మాట్లాడిన విజయ్..



అధికార డీఎంకే ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. డీఎంకే ర్యాడికల్స్‌కు అడ్డాగా మారిపోయిందని ఆరోపించారు. ఆ పార్టీ ప్రజలను విడదీసే రాజకీయాలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వారసత్వ రాజకీయాలతో పాటు దోపిడీ భావజాలం డీఎంకే స్వభావమని ఆయన మండిపడ్డారు. టీవీకే పార్టీ సమానత్వం కోసం స్పష్టమైన విధానాలను ముందుకు తీసుకొస్తోందని విజయ్ స్పష్టం చేశారు. ఇటీవల ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియ పారదర్శకంగా లేదని, ఆ ప్రక్రియ ప్రజలకు నష్టం కలిగించే అవకాశం ఉందని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేసినట్టు తెలిపారు. తమిళనాడులో అధికార డీఎంకేతో పాటు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవట్లేదని విజయ్ విమర్శించారు. రెండు పార్టీల విధానాలు ప్రజలకు అనుకూలంగా లేవని అన్నారు. విజయ్ ఒకేసారి డీఎంకే, బీజేపీలపై దాడి చేయడంతో తమిళనాడులో రాజకీయాలు వేడెక్కాయి. టీవీకే పార్టీ ఎవరితో పొత్తు పెట్టుకుంటుందో, ఎలాంటి వ్యూహాలతో ముందుకు సాగుతుందో అన్న విషయంపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.



# సరిహద్దులు మారొచ్చు

## రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ:** భారత విభజన సమయంలో పాకిస్తాన్‌కు వెళ్లిపోయిన సింధ్ అనే ప్రాంతం తిరిగి మన సరిహద్దుల్లో భాగం కావొచ్చని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం సింధ్ ప్రాంతం భారతదేశంలో భాగంగా లేదు కానీ ఆ నాగరికత సౌరసత్వం అనేది మనకే అనుసంధానమై ఉన్నందును తిరిగి భారత్‌లో విలీనం అయ్యే అవకాశం ఉందన్నారు. ఢిల్లీలో ఆదివారం సింధి సమాజ్ సమ్మేళన్ ఈవెంట్‌లో పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్.. ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. అప్పుడు ఎప్పుడో పాకిస్తాన్‌కు వెళ్లిపోయిన ఆ ప్రాంతం.. తిరిగి మన భారతదేశంలో భాగమవడానికి అవకాశం ఉందన్నారు. సింధ్ అనేది ఎప్పటికీ మనదేనని, సరిహద్దులు అనేవి భౌగోళికంగా మారుతుంటాయన్నారు. కాగా, సింధ్ ప్రాంతం ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది. ఇది పాకిస్తాన్‌లోని నాలుగు ప్రధాన ప్రావిన్స్‌లలో ఒకటి. 1947లో భారత విభజన సమయంలో సింధ్ పాకిస్తాన్‌లో భాగమైంది. ఆ సమయంలో అనేక మంది సింధీ హిందువులు భారతదేశానికి వలస వెళ్లారు. సింధ్ ప్రాంతం మొహెంజోదారో వంటి పురాతన సింధు లోయ నాగరికత స్థలాలకు ప్రసిద్ధి. సింధ్ ప్రావిన్స్‌కు కరాచీ రాజధానిగా ఉంది.

# శబరిమల గోల్డ్ కేసు: ఏపీకి లింకు..!

## నటుడు జయరాంను ప్రశ్నించే చాన్స్

**పథనంతిట్ట:** శబరిమల బంగారం దొంగతనం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆంధ్రప్రదేశ్ లింకులను ఆరా తీస్తోంది. అంతేకాకుండా.. ఈ కేసులో సినీనటుడు, జయరాం వాంగ్మూలాన్ని నమోదు చేయనుంది. సిట్‌లోని అత్యంత విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం.. శబరిమల బంగారం తస్కరణ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి చెన్నై, బెంగళూరులోని శ్రీరాంపూర్‌లోని అయ్యప్ప ఆలయాలకు బంగారు పూత పనులు చేయించారు. చెన్నైలోని ఆలయానికి బంగారు పూతకు అయిన ఖర్చును ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త ఖర్చు చేసినట్లు సిట్ గుర్తించింది. ఆలయ కుటీర ద్వారాలను కూడా ఆంధ్రప్రదేశ్‌లోనే తయారు చేసినట్లు తేల్చింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తులకు.. ఈ కేసుకు సంబంధాలపై సిట్ ఆరా తీస్తోంది. మరోవైపు చెన్నై ఆలయంలో బంగారు పూత చేయించాక జరిపిన పూజాకార్యక్రమాల్లో సినీనటుడు జయరాం పాల్గొన్నట్లు సిట్ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో నటుడు జయరాం వాంగ్మూలం సేకరించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో జయరాంను సంప్రదించింది. విచారణకు ఆయనకు అనుకూలమైన తేదీలను చెప్పాలని కోరింది. ఆ తేదీల్లో జయరాంను ప్రశ్నిస్తామని పేర్కొంది. కాగా.. ఈ కేసులో ఇప్పటికే ఉన్నికృష్ణన్‌తోపాటు.. తొమ్మిది మంది అరెస్టయ్యారు. దేవాదాయ శాఖ మాజీమంత్రి సురేంద్ర పాత్రపైనా సిట్ ఆరా తీస్తోంది. ఈ కేసులో తాజాగా అరెస్టయిన దేవస్వం బోర్డు మాజీ అధ్యక్షుడు పద్మకుమార్ పాస్‌పోర్టును సిట్ సీజ్ చేసింది. ఆయన ఇంట్లో జరిపిన తనిఖీల్లో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను సీజ్ చేసింది.

**బీజేపీ సీరియస్..**

శబరిమల బంగారం చోరీ అంశంపై బీజేపీ సీరియస్



అయ్యింది. ఈ కేసులో నిందితులెవరినీ అయ్యప్ప స్వామి వదిలిపెట్టబోరని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ అన్నారు. ఇప్పటి వరకు అరెస్టయిన వారంతా కమ్యూనిస్టులు, నాస్తికులేనని వ్యాఖ్యానించారు. దేవాలయాలను ధ్వంసం చేసినప్పుడే తమ మనుగడ ఉంటుందని కమ్యూనిస్టులు భావిస్తారని ఆయన ఎద్దేవా చేశారు. కోళికోడ్‌లో మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అటు బీజేపీ కేరళ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ కూడా ఈ కేసులో కేంద్రం జోక్యం చేసుకుంటుందని ప్రకటించారు. ఆదివారం ఆయన పథనంతిట్టలో మీడియాతో మాట్లాడుతూ.. భక్తులకు సదుపాయాలు కల్పించడంలో సీఎం పినరయి విజయన్ విఫలమైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి సారించాల్సి ఉంటుందని హెచ్చరించారు. శబరిమల బంగారం చోరీ అనేది పినరయి విజయన్‌కు తెలియకుండా జరిగిన అంశమేమీ కాదన్నారు. ఇదో రాజకీయ కుట్ర అని విమర్శించారు. శబరిమలకు సంబంధించి గడిచిన 30 ఏళ్ల ఆడిట్ రిపోర్టును విజిలెన్స్‌తో తనిఖీ చేయించాలని డిమాండ్ చేశారు.

## శబరిమలలో వర్చువల్ ఆన్‌లైన్ బుకింగ్ సంఖ్య మళ్లీ పెంపు

**తిరువనంతపురం:** శబరిమలలో రేపటివరకు (24వ తేదీ) తక్షణ దర్శనానికి అనుమతించే బుకింగ్ సంఖ్యను 5 వేలుగా పరిమితం చేయాలని కేరళ హైకోర్టు ముందుగా ఆదేశించింది. దీనిపై దేవస్వం బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు, పరిస్థితులను బట్టి తక్షణ బుకింగ్ సంఖ్యను పెంచుకోవడానికి అనుమతి ఇచ్చింది. దీన్ని అనుసరించి నిన్నటి నుంచి వర్చువల్ బుకింగ్ సంఖ్య పెంచింది. ప్రస్తుతం ఒక నిమిషానికి 85 మంది భక్తులు వరకు 18వ మెట్టుకు ఎక్కడానికి అనుమతి ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది దేవస్వం బోర్డు.





# ఎయిర్ ఫోర్స్ అధికారులను చంపింది మాలికే

1990లో జరిగిన ఎయిర్ ఫోర్స్ అధికారుల హత్య కేసులో కీలక ముందడుగు పడింది. ఆ హత్య సమయంలో ఎయిర్ ఫోర్స్ అధికారిని షూట్ చేసింది జేకేఎల్ఎఫ్ లీడర్ యాసిన్ మాలిక్ అని ప్రధాన సాక్షి గుర్తించారు. ఈ కేసు విచారణ టాడా కోర్టులో జరుగగా యాసిన్ మాలిక్ ప్రధాన నిందితుడని కాల్పుల సమయంలో అక్కడే ఉన్న ప్రత్యక్ష సాక్షి తెలిపారు. 1990లో జమ్మూకశ్మీర్ శ్రీనగర్ పరిసరాల్లో జరిగిన నలుగురు ఎయిర్ ఫోర్స్ అధికారుల హత్య కేసు విచారణను ప్రత్యేక టాడా కోర్టు విచారించింది. ఈ సందర్భంగా కాల్పుల ఘటన సమయంలో అక్కడే ఉన్న ఇద్దరు ప్రత్యక్ష సాక్షులను విచారించింది. ఆరోజు అధికారులను కాల్చి చంపింది జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ నాయకుడు యాసిన్ మాలిక్ అనే ప్రధాన సాక్షి తెలిపారు. ఈ కేసులో మాలిక్ ను ఎలా గుర్తించారని ప్రశ్నించగా "మాలిక్ గడ్డం స్టైల్ తప్ప ప్రస్తుతం ఏమీ మారలేదు కనుక నిన్ను గుర్తించడంలో నాకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదు" అని ప్రధాన సాక్షి అన్నారు. అంతే కాకుండా ఆరోజు దాడిచేసిన మరో ముగ్గురు షౌకత్ భక్షి, నన్నాజీ, జావేద్ అహ్మద్ లను సాక్షులు గుర్తించారు. ఆరోజు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నానని పేర్కొన్నారు.

**అసలేం జరిగింది**

1990 జనవరి 25న శ్రీనగర్ రవల్పురా వద్ద బస్సు కోసం వేచి చూస్తున్న వారిపై యాసిన్ మాలిక్ నేతృత్వంలోని టెర్రరిస్టుల బృందం కాల్పులు జరిపింది. ఈ ఘటనలో నలుగురు ఎయిర్ ఫోర్స్ అధికారులు మృతి చెందారు. కాగా ఆ ఘటనలో ప్రధాన నిందితుడిగా ఉన్న యాసిన్ మాలిక్ ప్రస్తుతం టెర్రర్ ఫండింగ్ కేసులో ఢిల్లీ తీహార్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్నారు.




# టైటిల్‌తోనే భారీ హైప్!

తండేల్ సూపర్ హిట్ తర్వాత అక్కినేని హీరో నాగచైతన్య.. డైరెక్టర్ కార్తీక్ దండుతో జతకట్టారు. వీరిద్దరి కాంబోలో మైథలాజికల్ థ్రిల్లర్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం చైతూ కెరీర్‌లో 24వ మూవీ కాగా.. ప్రస్తుతం ఎన్‌సీ24 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్నారు. ఈ మూవీలో చైతూ సరసన సంక్రాంతికి వస్తున్నాం బ్యూటీ మీనాక్షి చౌదరి హీరోయిన్‌గాల కనిపించనుంది. అయితే ఇవాళ చైతూ బర్త్ డే కావడంతో మేకర్స్ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. చైతూ మూవీ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు వృషకర్మఅనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ మేరకు నాగచైతన్య పోస్టర్‌ను కూడా పంచుకున్నారు. ఈ పోస్టర్ చైతూ ఫ్యాన్స్‌న విపరీతంగా ఆకట్టుకుంటోంది.



# స్పిరిట్ లాంచ్

సాధారణంగా ఓ సినిమా గురించి ప్రకటించిన తర్వాత కొన్నాళ్లకే లాంచింగ్, షూటింగ్ లాంటివి పెట్టుకుంటారు. కానీ ప్రభాస్ 'స్పిరిట్'కి మాత్రం ఏకంగా నాలుగేళ్లు పట్టింది. అవును మీరు విన్నది నిజమే. 2021 అక్టోబరు 7న ఈ ప్రాజెక్ట్ గురించి డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా అనౌన్స్ చేశాడు. తర్వాత నుంచి అప్పుడు ఇప్పుడు అనుకుంటూ ఆలస్యమై పోయింది. ఇన్నాళ్లకు పూజా కార్యక్రమంతో అధికారికంగా లాంచ్ అయింది. హైదరాబాద్ వేదికగా సందీప్ రెడ్డి వంగా ఆఫీస్‌లోనే పూజా కార్యక్రమంతో ఈ సినిమా మొదలైంది. చిరంజీవి ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రభాస్ కూడా వచ్చాడు గానీ ఆయనకు సంబంధించిన ఒక్క ఫొటో కూడా బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. బహుశా లుక్ ఏంటో తెలియకూడదని సందీప్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. స్వయంగా సందీప్.. 'స్పిరిట్' లాంచింగ్ కార్యక్రమానికి ప్రభాస్ వచ్చిన విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నాడు. ప్రభాస్ అన్న చేతులు మీకు చాలు అనుకుంటా, అంచనాలు పెంచడానికి అని రాసుకొచ్చాడు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ తృప్తి దిమ్రి, నిర్మాత భూషణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ రోజు నుంచే షూటింగ్ కూడా మొదలైపోయింది. ప్రస్తుతం ఈ లాంచ్ ఈవెంట్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# స్పిరిట్ కోసం ఇద్దరు టాలీవుడ్ స్టార్స్ వారసులు

కొన్నిరోజుల క్రితం హీరో రవితేజ కొడుకు, డైరెక్టర్ త్రివిక్రమ్ కొడుకు గురించి కొన్ని రూమర్స్ వచ్చాయి. 'స్పిరిట్' మూవీ కోసం వీళ్లు పనిచేస్తున్నారనే న్యూస్ వైరల్ అయింది. ఇది నిజమా కాదా అని అందరూ మాట్లాడుకున్నారు. కానీ ఇప్పుడు ఈ విషయమై ఫుల్ క్లారిటీ వచ్చేసింది. ఆ ఫొటోనే ఇప్పుడు వైరల్ అవుతోంది. అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ సినిమాలతో తన రేంజ్ పెంచుకున్న డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా.. ప్రభాస్‌తో 'స్పిరిట్' అనే మూవీ చేస్తున్నాడు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో ఈ చిత్రం అధికారికంగా లాంచ్ అయింది. హీరో ప్రభాస్, హీరోయిన్ తృప్తి దిమ్రితో పాటు టీమ్ అంతా హాజరయ్యారు. మెగాస్టార్ చిరంజీవి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాంచ్ అయిపోయిన తర్వాత చిరంజీవితో కలిసి డైరెక్షన్ టీమ్ అంతా ఫొటో తీసుకున్నారు. అలా డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ తీసుకున్న ఫొటోలోనే హీరో రవితేజ కొడుకు మహాధన్, దర్శకుడు త్రివిక్రమ్ కొడుకు రిషి కనిపించారు. దీంతో కొన్నాళ్ల క్రితం వచ్చిన నిజమని క్లారిటీ వచ్చింది. త్రివిక్రమ్ వారసుడు తనలానే డైరెక్టర్ అయ్యే పనిలో ఉండగా.. రవితేజ కొడుకు మాత్రం దర్శకత్వం వైపు రావడం ఆసక్తికరంగా అనిపిస్తుంది. గతంలో 'రాజా ది గ్రేట్' మూవీలో చైల్డ్ ఆర్టిస్టుగా చేసినప్పటికీ ప్రస్తుతానికైతే సందీప్ దగ్గర దర్శకత్వం నేర్చుకునే పనిలో పడ్డారు.





# మహిళ పోరాటం

రాయ్ లక్ష్మీ లీడ్ రోల్‌లో నటించిన లేడీ ఓరియంటెడ్ మూవీ 'జనతాబార్'. అమన్ ప్రీత్‌సింగ్, దీక్షా పంత్, శక్తి కపూర్, అనూప్ సోని, సురేష్ భూపాల్ ఇతరపాత్రలు పోషించారు. అశ్వర్థ నారాయణ సమర్పణలో రమణ మొగిలి స్వీయ దర్శకత్వంలో రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది. "స్పోర్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకున్న మహిళలపై ఆ విభాగంలోని ఉన్నతాధికారులు చేస్తున్న లైంగిక వేధింపులకు చరమగీతంపాడటానికి ఓ మహిళ ఎలాంటి పోరాటం చేసింది? అన్నదే 'జనతాబార్' కథ. మహిళల్లో చైతన్యం నింపే చిత్రమిది" అని రమణ మొగిలి అన్నారు.




# డబ్బుల్లేవన్నారు..


12th ఫెయిల్.. అందరినీ కంటతడి పెట్టించిన సినిమా. అందరి మనసులు గెల్చుకున్న మూవీ. కానీ ఈ సినిమా రిలీజ్‌కు ముందు దీన్ని కొనేందుకు ఓటీటీలు వెనకడుగు వేశాయంటున్నాడు బాలీవుడ్ దర్శకుడు విధు వినోద్ చోప్రా. ఈయన ఇప్పటితరానికి 12th ఫెయిల్ డైరెక్టర్‌గా తెలుసు.. కానీ ఇతడు పరిండా, 1942:ఎ లవ్ స్టోరీ వంటి హిట్ సినిమాలను తెరకెక్కించాడు. వినోద్ చోప్రా తాజాగా 56వ ఇఫీ(ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఇండియా) వేడుకకు హాజరయ్యాడు.

**థియేటర్‌లో రిలీజ్ చేయొద్దన్నారు**

'అన్‌స్క్రిప్టెడ్: ద ఆర్ట్ అండ్ ఎమోషన్ ఆఫ్ ఫిలిం మేకింగ్' పేరిట జరిగిన చర్చలో విధు వినోద్ చోప్రా మాట్లాడుతూ.. 12th ఫెయిల్ తీసినప్పుడు ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర వర్కవుట్ కాదన్నారు. నా భార్యతో సహా అందరూ దీన్ని థియేటర్‌లో రిలీజ్ చేయొద్దన్నారు. ఇలాంటి సినిమాను ఎవరూ వెళ్లి చూడరని చెప్పారు. ఎంతో ప్రేమతో ఈ సినిమా చేశాం.. జనాలు కచ్చితంగా ఆదరిస్తారన్న నమ్మకం నాకుందన్నాను.

**డబ్బుల్లేవన్న ఓటీటీ**

నా నమ్మకం నిజమైంది. థియేటర్లలో ఏడు నెలలపాటు ఆడింది. ఒక ఓటీటీ ప్లాట్‌ఫామ్ అయితే సినిమా చూశాక తమ దగ్గర కొనేంత డబ్బు లేదని చెప్పింది. మీకు సినిమా అర్థం కాలేదేమో అన్నాను. అందుకో వ్యక్తి.. సినిమాలో చూపించిన మనుషులు నిజ జీవితంలో ఉండరు అన్నాడు. అలా వారు మా సినిమాను కొనేందుకు ఇష్టపడలేదు అని గుర్తు చేసుకున్నాడు. తర్వాత సినిమా బ్లాక్‌బస్టర్ హిట్టవడం జియో హాట్‌స్టార్‌లో రిలీజవడం చకచకా జరిగిపోయాయి.



## జాతీయ అవార్డులు

మొన్నటి మొన్న (ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు కేటగిరీల్లో) రెండు జాతీయ అవార్డులు సైతం సాధించింది. 12th ఫెయిల్ మూవీ విషయానికి వస్తే ఇందులో విక్రాంత్ మాస్సే ప్రధాన పాత్రలో నటించగా మేధా శంకర్ హీరోయిన్‌గా నటించింది. ఐపీఎస్ అధికారి మనోజ్ కుమార్ శర్మ-ఐఆర్‌ఎస్ అధికారిణి శ్రద్ధా జోషిల జీవిత కథ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. 2023 అక్టోబర్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



# మీరు పెట్టిన ఆ పేరుతోనే జీవిస్తున్నా..

## విజయ్ దేవరకొండ



సత్యసాయి వందో జయంతి సందర్భంగా టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ ఆయనను స్మరించుకున్నారు. నాకు చిన్నప్పుడు మీరు పెట్టిన విజయ్ సాయి అనే పేరుతోనే ప్రతి రోజు జీవిస్తున్నానని పోస్ట్ చేశారు. ఈ ప్రపంచానికి దూరంగా మాకు విద్యను, ఎన్నో జ్ఞాపకాలను అందించిన వాతావరణాన్ని కల్పించారని ఆ రోజులను గుర్తు చేసుకున్నారు. విజయ్ తన ట్వీట్‌లో రాస్తూ.. 'మేమందరం ప్రతిరోజూ మీ గురించి ఆలోచిస్తాం. ముఖ్యంగా మంచి, చెడు సమయాల్లో. మీ నుంచి మేము చాలా నేర్చుకున్నాం. మా జీవితాల్లో వచ్చిన మార్పును తెలుసుకున్నాం. ప్రపంచానికి ఇవ్వడానికి మేము చేయగలిగిన విధంగా మాలో శక్తిని నింపారు. మీకు 100వ పుట్టినరోజు శుభాకాంక్షలు.. మీరు మాతో పాటే ఎప్పటికీ జీవించే ఉంటారు' అంటూ రాసుకొచ్చారు. ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com